

నేడే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

2,32,916 మందికి రూ.101. 73 కోట్లు

రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదార్ల ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు ఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. జూన్ 1న ఆదివారం అయినందున ప్రభుత్వం నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలో ముందుగా పంపిణీకి ఏర్పాటు చేయించారన్నారు. మొత్తం జిల్లాలో 2,32,916 మందికి రూ.101 కోట్ల 73 లక్షల 77 వేల 500 పంపిణీ చేయవలసి ఉంది. ఈ సొమ్మును బ్యాంక్‌ల నుంచి శుక్రవారమే డ్రా చేసినట్టు ఆయన చెప్పారు.



చంద్రబాబు నేడు కోనసీమకు



చెయ్యేరులో ఏర్పాటైన ప్రజావేదిక

- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సీఎం పాల్గొనే రెండు సభా వేదికలను సిద్ధంచేసిన అధికారులు
- సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్.. పరిశీలించిన డీఐజీ అశోక్‌కుమార్
- 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- ఆరు గంటల పర్యటనకు ఏర్పాట్లు పూర్తి




సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు దాట్ల, రాజప్ప, పెందుర్తి

అమలాపురం/ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం లోని రెండు గ్రామాల్లో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జరపనున్న పర్యటనకు అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో భారీ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. హెలిప్యాడ్‌తోపాటు రహదారులు అభివృద్ధి, సీఎం పాల్గొనే రెండు ప్రాంతాల్లో బహిరంగ సభలకు భారీ వేదికలు సిద్ధమయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పూడికతీత పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఆరు గంటలపాటు రెండు గ్రామాల్లో జరిగే సీఎం పర్యటనకు అనూహ్యమైన రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం సీఎం కాన్వాయ్‌తో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌తోపాటు వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు సభావేదికల వద్ద భారీ సామర్థ్యం కలిగిన జనరేటర్లను ఏర్పాటుచేశారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కూలర్లు, ఏసీలు ఏర్పాటుచేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు వంటివి ప్రజల కోసం సిద్ధం చేస్తున్నారు. అతిథుల కోసం ప్రత్యేక భోజన ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాగా సీఎం చంద్రబాబు శనివారం నాటి పర్యటనకు సంబంధించి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. హెలిప్యాడ్ నుంచి ట్రయల్ రన్ ప్రారంభమై సత్తెమ్మతల్లి గుడి మీదుగా చెయ్యేరు గున్నేపల్లి, చెయ్యేరు వరకు నిర్వహించారు. సీఎం పాల్గొనే కార్యక్రమాల వద్ద కూడా ట్రయల్ రన్ నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, మంత్రి సుభాష్, సీఎం పర్యటన కమిటీ సారథి పెందుర్తి వెంకటేష్, పలువురు నేతలు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. తర్వాత కొన్ని సూచనలు చేసి, వాటిని సరిదిద్దాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా..

సీఎం చంద్రబాబు పర్యటనలో స్వల్పమార్పులు జరిగాయి. ఆ ప్రకారం.. శనివారం ఉదయం 11 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరతారు. 11.45 గంటలకు కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 11.45 గంటల నుంచి 12.10 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో పరస్పర సంభాషణలు ఉంటాయి. 12.10 గంటలకు బయలుదేరి కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి రోడ్డు మార్గాన బయలుదేరతారు. 12.15 గంటల నుంచి 45 నిమిషాలపాటు పేదల సేవలో కార్యక్రమం బంగారు కుటుంబం(పీ4)లో భాగంగా గ్రామస్తులు కొందరిని దాతలు దత్తత తీసుకుంటారు. అలాగే ఉపాధి పథకం కింద చేపట్టే చెరువు పూడికతీత పనుల పరిశీలన, కార్మికులతో సమావేశం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరి చెయ్యేరులో ప్రజావేదిక జరిగే ప్రాంతానికి చేరుకుంటారు. 1.05 గంటల నుంచి 2 గంటల వరకు సమయాన్ని రిజర్వు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు స్థానిక ప్రజలతో ప్రజావేదికలో ముఖాముఖి సమావేశమవుతారు. 3.30 గంటలకు ప్రజావేదిక నుంచి బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి వద్దనున్న టీడీపీ కేడర్ సమావేశ వేదికకు చేరుకుంటారు. 3.35 గంటల నుంచి 5.05 గంటల వరకు కేడర్ సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి 5.10 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5.15 గంటలకు హెలిప్యాడ్‌కు నుంచి బయలుదేరి ఆరు గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకుంటారు.




పోలవరం ఎడమ కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

పోలవరం ఎల్‌ఎంసీ పనులు వేగవంతం!

- జూన్ ఆఖరుకి విశాఖకు నీరందించాలనే లక్ష్యంతో పనులు
- ఎనిమిది ప్యాకేజీలతో ఊపందుకున్న పనులు
- కోరుకొండ మండలం నుంచి విశాఖ వరకూ పనులు మొదలు
- జూన్ 30లోపు పూర్తిచేసే లక్ష్యం.. ఎల్‌ఎంసీ ఎస్ఈ ఏసుబాబు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు వేగవంతం అయ్యాయి. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన కాలువలు రెండు ఉన్న సంగతి తెలిసిందే. ఒకట కుడి ప్రధాన కాలువ(ఆర్ఎంసీ). ఇది పోలవరం నుంచి కృష్ణా జిల్లా వరకూ వెళుతుంది. ఇది ఇంచుమించు పూర్తయిన సంగతి తెలిసిందే. రెండోది ఎడమ ప్రధాన కాలువ(ఎల్ఎంసీ). ఇది ప్రాజెక్టు దగ్గర నుంచి విశాఖ వరకూ నీటిని తీసుకుని వెళ్లే లక్ష్యంతో నిర్మిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పట్టిసీమను నిర్మించి ఆర్ఎంసీ ద్వారా కృష్ణా నదికి గోదావరి నీటిని మళ్లించిన సంగతి తెలిసిందే. అదేవిధంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మించి ఏలేరు రిజర్వాయర్‌కు నీటిని పంపించి, అక్కడ నుంచి విశాఖకు మంచినీటిని పంపించే ప్రయత్నం చేశారు. కానీ 2019లో ప్రభుత్వం మారడంతో అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మొత్తం పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని కూడా పనిచేయకుండా చేసేశారు. దీంతో చాలా బ్రిడ్జిలు, సూపర్ పాసేజ్‌ల వంటి పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించడంతో తిరిగి పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ వంటి పనులు చేస్తూ, వాటికంటే ముందు ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా పూర్తిచేసి, విశాఖకు నీరందించాలనే లక్ష్యంతో జనవరిలో పనులు మొదలుపెట్టారు. మొత్తం పోలవరం ప్రాజెక్టు దగ్గర నుంచి 214.808 కిలోమీటర్ల మేర ఈ ఎడమ ప్రధాన కాలువను నిర్మించవలసి ఉంది. ఇది పూర్తి చేసి విశాఖ ఇండిస్ట్రియల్ అవసరాలకు నీరందివ్వడంతోపాటు దారిలోని గ్రామాల మంచినీటి అవసరాలు కూడా తీర్చాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు అధికార్లకు లక్ష్యాలను నిర్దేశించారు. జూన్ నెలాఖరుకి ఇది పూర్తి చేయాలనే తపనతో పనులు జరుగుతున్నాయి. మొత్తం రూ.3063.88 కోట్లతో గతంలో ఈ పనులు మొదలుపెట్టగా రూ.18.12.956 పనులు పూర్తిచేశారు. మిగతా పనిని 8 ప్యాకేజీలుగా విభజించి పనులు మొదలుపెట్టారు. ప్యాకేజీ -1 పరిధిలోకి 25 కిలోమీటర్ల మేర కాలువ ఉంది. సీతానగరం మండలం శివారు నుంచి కోరుకొండ మండలం పరిధివరకూ ఉంది. ఇక్కడ ఎర్త్ వర్కు జరుగుతోంది. జూన్ నెలాఖరికి ఇది పూర్తి చేస్తామని అక్కడి అధికారులు చెబుతున్నారు. ప్యాకేజీ -2 ఇప్పటికే పూర్తయింది. ప్యాకేజీ-3 పరిధిలో ఏలేరు రిజర్వాయర్‌లో షైఫన్ నిర్మిస్తున్నారు. వర్షాల వల్ల పనులకు కాస్త ఇబ్బంది కలిగినా రాత్రి పగలూ పనిచేస్తున్నారు. ఇది కృష్ణవరం సమీపంలో జరుగుతోంది. 4వ ప్యాకేజీ కింద పంపానది పరిధిలో పనులు జరుగుతున్నాయి. అక్కడ అక్విడక్ట్ నిర్మిస్తున్నారు. ఫైల్స్ నిర్మాణం మొదలు పెడుతున్నారు. కానీ ఇక్కడ పంపానదిలో 83 అడుగుల కంటే తక్కువ నీరు ఉంటే పనులు వేగవంతంగా జరుగుతాయని, ఇటీవల నీటిమట్టం 86.5 అడుగులకు పెరిగిందని, దీనితో ఇక్కడ పనుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలు కూడా అన్వేషిస్తున్నారు. ముందు ఎర్త్‌వర్కు పూర్తి చేస్తున్నారు. 5వ ప్యాకేజీ కింద కుమ్మరలోవ ప్రాంతం ఉంది. ఇక్కడ ఒక కాలనీని ఇప్పుడే ఖాళీ చేయిస్తున్నారు. ఈలోపు ఈ ప్రాంతంలో రెండు పెద్ద కొండల మధ్య నుంచి కాలువ వెళ్లడం వల్ల ఆ కొండలు పగలగొడుతున్నారు. 6వ ప్యాకేజీ అనకాపల్లి జిల్లా పరిధిలోని పాయకరావు పేట నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇక్కడ కూడా కొన్ని సమస్యలు ఉండగా, ఇటీవలే పరిష్కారమయ్యాయి. 78 మీటర్ల నుంచి 90 మీటర్ల ఎత్తువరకూ ఇక్కడ కొండలు ఉన్నాయి. వాటిని తొలగిస్తున్నారు. ఈ కొండల సమీపంలో షుగర్ ఫ్యాక్టరీ, దుర్గాకాలనీ ఉండడతో అక్కడ సమస్య పరిష్కారం కోసం కొంత సమయం పట్టింది. 7వ ప్యాకేజీ కింద అనకాపల్లిలో దార్లపూడి ప్రాంతం ఉంది. ఇక్కడ అక్విడక్టు నిర్మిస్తున్నారు. 8వ ప్యాకేజీ విశాఖ పరిధిలో ఉంది. 30 మీటర్ల నుంచి 40 మీటర్ల లోతు వరకూ నీరుండడంతో ఇక్కడ డీసిల్టేషన్ కోసం డ్రెడ్జిం గ్ చేస్తున్నారు. కాగా పోలవరం ఎడమ కాలువ పనులను జూన్ నెలాఖరుకి పూర్తిచేసి విశాఖకు నీరందించే లక్ష్యంతో పనులు వేగవంతం చేశామని పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎస్ఈ బి ఏసుబాబు తెలిపారు.



'సుఖీభవ' అనరే..



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో అన్నదాత సుఖీభవకు రీసర్వే గండం
- గత వైసీపీ ప్రభుత్వంలో తప్పిదాలు అన్నదాతలకు శాపంగా మారిన వైనం
- సర్వే నెంబర్ల స్థానంలో తెచ్చిన ఎల్‌పీఎం నెంబర్ల విధానంలో అడ్డగోలు తప్పులు
- ఒక్కో ఎల్‌పీఎంల్లో పదులకొద్దీ రైతుల విస్తీర్ణాలు ఉంచేసి రీసర్వే
- ఉమ్మడి జిల్లాలో 69,327 మంది పథకానికి దూరమయ్యే ప్రమాదం
- ఇప్పటివరకు 8,82,286 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ పరిశీలన పూర్తి
- మరోపక్క అర్హుల జాబితా ఖరారుకు వ్యవసాయశాఖ దాదాపుగా కసరత్తు పూర్తి
- ఈలోపు రెవెన్యూశాఖ తప్పులు సరిదిద్దకపోతే వేలల్లో నష్టపోనున్న రైతులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి రీసర్వే తప్పులు తల నొప్పులుగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అడ్డగోలు వ్యవహారంతో వేలాది మంది అన్నదాతలు ఇప్పుడు పథకానికి దూరమయ్యే ప్రమాదం నెలకొంది. పూర్వపు సర్వే నెంబర్ల స్థానంలో కొత్తగా ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించే క్రమంలో అనేక తప్పులు దొర్లడంతో రైతులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఒక రైతుకు ఒక ఎల్‌పీఎంకు బదులు ఒకే నెంబర్ పదుల కొద్దీ రైతులకు ఇచ్చేసి రీసర్వే పాపాలు చేయడంతో వారి పేర్లు సర్వర్లకు ఎక్కడం లేదు. ఈ తప్పులను సరిచేయాలని వ్యవసాయశాఖ అధికారులు రెవెన్యూశాఖకు వివరాలు పంపినా కనీసం ఖాతరు చేయకుండా వాటిని పక్కన పడేసింది. మరోవైపు జిల్లాస్థాయిలో అర్హుల జాబితాలను తయారు చేసి వాటిని ప్రభుత్వానికి పంపడంలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమైంది. ఈలోపైనా సమస్య పరిష్కారం చేయాలని రైతులు కోరుతున్నారు.

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకం జూన్‌లో అమలు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చే డబ్బులతో కలిసి రైతు కుటుంబం యూనిట్‌గా ఏడాదికి రూ.20వేల చొప్పున ఈ పథకం ద్వారా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని సీఎం ఈ సందర్భంగా స్పష్టంచేశారు. అంటే పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6వేలు, మిగిలిన రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పథకం కింద డబ్బులు జమచేయనున్నారు. అందులోభాగంగా పథకం అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కసరత్తు మొదలుపెట్టింది. అందులోభాగంగా జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలని జిల్లాల వ్యవసాయశాఖలను ఆదేశించింది. ఈనేపథ్యంలో తమ వద్దనున్న వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగా జిల్లాల వారీగా రైతుల వివరాల నివేదికను అధికారులు సిద్ధం చేశారు. వీటిని రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లోని వీఏఏలకు, మండల వ్యవసాయాధికారులకు పరిశీలన కోసం ఇటీవల పంపారు. వెబ్‌ల్యాండ్ వివరాలను సరిచూసి తుది జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో వ్యవసాయాధికారులు, సిబ్బంది ప్రస్తుతం జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. అయితే వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా లబ్ధిదారుల జాబితా తయారీలో ఇప్పుడు వ్యవసాయశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వేలాదిమంది రైతులకు సంబంధించి వివరాలు గందరగోళంగా ఉండడంతో వాటిని నమోదు చేయడానికి నిబంధనలు అంగీకరించక ఏంచేయాలో తెలియక వారిని పక్కన పెడుతున్నారు. దీనికంతటికి గత వైసీపీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న రీసర్వే తప్పులే కారణం. అప్పట్లో రీసర్వే పేరుతో ప్రభుత్వం ఎప్పటి నుంచో ఉన్న సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబర్ల వ్యవస్థ తీసుకువచ్చింది. ఈవిధానంలో రీసర్వే అనంతరం ఒక రైతుకు ఒక ఎల్‌పీఎం నెంబరు కేటాయించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో రీసర్వే అడ్డదిడ్డంగా జరగడంతో ఎల్‌పీఎం నెంబర్లు ఒక రైతుకు బదులు అదే నెంబరు పది మందికిపైగా రైతులకు అడ్డదిడ్డంగా కేటాయించేశారు. ఇలా వేలాదిమంది రైతులకు ఒకే నెంబరు ఇచ్చేశారు. అయితే ఇప్పుడు ఈ డేటాను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఈ తప్పులతో అనేకమంది రైతులు పంట రుణాలు పొందేందుకు, ఆకాల వర్షాలు, వరదలప్పుడు వచ్చే పంట నష్టపరిహారం తీసుకునేందుకు వీలుకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు ఉమ్మడి ఎల్‌పీఎం ఉన్న రైతులకు సైతం ఈ లబ్ధి అందకుండా పోయింది. అప్పటి నుంచి ఉమ్మడి ఎల్‌పీఎంలను విడదీసి ప్రత్యేక నెంబర్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ పెద్దగా జరగడం లేదు. దీంతో వీరంతా ఇప్పుడు సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆధార్ అనుసంధానంలో తప్పులు, మరణించిన వారి పేరుపై భూమి ఉన్నట్టు చూపించడం, సర్వే నెంబర్లల్లో తేడాలు సైతం చాలా ఇబ్బందికరంగా మారాయి.

సరిచేయకుంటే ఇబ్బందులే..

వాస్తవానికి అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి పొందేందుకు రైతులకు సంబంధించిన అన్ని వివరాలు సక్రమంగా ఉండాలి. ఉమ్మడి ఎల్‌పీఎం ఉంటే అందులో ఉండే రైతులకు లబ్ధి అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకే నెంబరు ఇద్దరు, ముగ్గురు రైతులకు వేసేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం లేదు. దీంతో ఉమ్మడి ఎల్‌పీఎం నెంబర్లతోపాటు ఇతర రెవెన్యూపరమైన అంశాలను సరిచేసేందుకు వ్యవసాయశాఖ రెవెన్యూ అధికారులకు జాబితా పంపింది. ఎల్‌పీఎం సమస్యలు, సర్వేనెంబర్ల తేడాలు సరి చేయాలని కొంతకాలం కిందట పంపించింది. కానీ ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు దీనిపై అసలు దృష్టిసారించలేదు. దీంతో పథకం అమలుకు గడువు దగ్గరపడ్డా సమస్య పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదు. వాస్తవానికి కాకినాడ జిల్లాలో ఇంతవరకు 2,63,416 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేశారు. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 17,021 మంది రైతుల వివరాలను సరిచేసి పంపించాలని తహశీల్దార్లను వ్యవసాయశాఖ అధికారులు కోరారు. కానీ ఇందులో ఇప్పటివరకు 1,169 మాత్రమే పరిష్కరించారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో 2,52,002 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, 2,17,007 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 11,932 మంది రైతుల వివరాలను సరిచేయాలని రెవెన్యూశాఖకు పంపారు. ఇందులో ఇంతవరకు 2,141మాత్రమే పరిష్కారమయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 3,67,049 మంది రైతుల వివరాలకుగాను 3,66,868 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. ఇంకా 40,374 మంది రైతుల సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉండగా, అందులో 2,011 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇలా సరిచేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది. లేదంటే అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్న అన్నదాతలకు ప్రయోజనం దక్కే అవకాశం ఉండదు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ వివరాలు ఇలా...

	కాకినాడ జిల్లా	తూర్పుగోదారి జిల్లా	కోనసీమ జిల్లా
ఆన్‌లైన్‌లో నమోదైన రైతులు	2,63,416	2,52,002	3,67,049
పరిశీలన పూర్తయిన రైతులు	2,63,416	2,17,007	3,66,868
తహశీల్దార్లకు పంపిన సమస్యలు	17,021	11,932	40,374
వీటిలో పరిష్కరించినవి	1169	2141	2011
ఇంకా పెండింగ్‌లో ఉన్నవి	15,852	9791	38,363

కసరత్తు మొదలు..

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు వీలుగా రెవిన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 69,327 మంది రైతులు పథకానికి దూరం కానున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో వివిధసాకులతో రైతు భరోసా కింద లబ్ధిపొందే వారి సంఖ్యను అడ్డంగా కుదించేశారు. ఏటేటా వివిధ నిబంధనల పేరుతో లబ్ధిదారులను తగ్గించేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం సుఖీభవ పథకానికి ఎలాంటి కోతలు లేకుండా వెబ్‌ల్యాండ్ ఆధారంగా కుటుంబం యూనిట్‌గా ప్రతి రైతుకి పథకం అందించేలా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్రస్థాయి నుంచి పంపిన వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా జాబితాను తయారు చేసి రెండు రోజుల్లో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నుంచి ప్రభుత్వానికి జాబితా పంపనున్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరోసారి తనిఖీ చేయనుంది. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాలను మళ్లీ జిల్లాలకు పంనుంది. ఈ జాబితాలను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రదర్శించి త్వరలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆతర్వాత తుది జాబితా రూపొందించి పథకం డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

జిల్లాలో ఎంటర్‌ప్రైజెస్‌పై సర్వే

- ఇప్పటివరకూ 92,336 సంస్థల గుర్తింపు
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంటర్‌ప్రైజెస్ ఎంతమంది ఉన్నారనే వివరాల సేకరణకు సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకూ 92,336 ఉన్నట్టు గుర్తించినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంకాలం పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల ఆధారంగా 92,980 ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయని, వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎన్ని ఉన్నాయనే అంశాలపై సర్వే చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో రూ.2150 కోట్ల పెట్టుబడులతో 3,300 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి కల్పించే విధంగా వివిధ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. క్లస్టర్ అభివృద్ధి పథకం ద్వారా క్లస్టర్లు త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 37 పరిశ్రమలకు సంబంధించిన రూ.67,65,637 విలువైన రాయితీలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించి, వాటిని మంజూరు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, జిల్లా పరిశ్రమల అధికారి వాణీధర్ రామన్, డీఆర్వో టి. సీతారామమూర్తి, ఆర్డీవోలు ఆర్ కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు డెల్టా కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం, మే 30 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఖరీఫ్ పంటకు సంబంధించి ఆదివారం నాడు డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. రబీ అనంతరం ఏప్రిల్ 27న తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలను మూసివేసి పంట కాలువల్లో తూడు తొలగింపు, పూడిక తీత, షెట్టర్‌లు, లాకుల రిపేర్లు వంటి క్లోజర్ పనులు చేపట్టి ఖరీఫ్‌లో రైతాంగానికి సాగునీరు అందించడానికి కాలువలను సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నిర్ణయించిన ముహూర్తానికి పూజలు నిర్వహించి హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తి కాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. కాగా ఆదివారం డెల్టా కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్టు సర్కిల్ ఎస్ఈ గోపీనాథ్ తెలిపారు.


నేడు చత్తీస్‌ఘడ్ డిప్యూటీ సీఎం రాక

- అహిల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలకు అరుణ్ సాహో హాజరు

4

ఆంధ్రజ్యోతి
విలేకరులు కావలెను
ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో
మండలాల వారీగా రిపోర్టర్ల ఖాళీలు :
1. అమలాపురం అర్బన్ 2. రామచంద్రపురం
3. మండపేట రూరల్ 4.కాజులూరు 5. పెదపూడి
6.కాకినాడ జగన్నాథపురం 7. కాకినాడ కల్చరల్
8.రాజమహేంద్రవరం కలెక్టరేట్ 9.రాజమహేంద్రవరం లీగల్ అండ్ క్రైం 10. మధురపూడి ఎయిర్‌పోర్టు
11. ఏజెన్సీ గంగవరం 12. డొంకరాయి
ప్రాంతాల్లో వార్తల సేకరణకు విలేకరులు కావలెను.
అభ్యర్థులు ఇంటర్ / డిగ్రీ చదివి వుండాలి. తెలుగు భాషలో చక్కని పరిజ్ఞానం, సంఘటనలను వార్తగా మలచగలిగే నైపుణ్యం వుండాలి.
పైన పేర్కొన్న అర్హతలున్న అభ్యర్థులు..
తేది 4-6-2025 (బుధవారం)
ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు జరిగే రాత పరీక్ష, ఇంటర్వ్యూకు హాజరుకావలెను.
అడ్రస్ : ఆంధ్రజ్యోతి కార్యాలయం
దివాన్‌చెర్వు, వెలుగుబంద రోడ్, పాలచర్ల పంచాయతీ
ఫోన్ : 99854 11242

మంచు కొండ



చూసే కళ్లు ఉండాలి కానీ మన్యంలో ఎటు చూసినా ప్రకృతి అందాలే కనిపిస్తాయి. ఇక్కడ మండు వేసవిలోనూ అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీనికితోడు ఉదయం, సాయంత్రం వేళల్లో మంచు పడుతోంది. వర్షం వేళ మేఘాల మంచు ముసుగు పచ్చటి కొండలను తాకుతోంది. అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని ఫోర్‌బై డ్యాం వద్ద ఈ దృశ్యం చూపరులను కట్టిపడేస్తోంది.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)

అరుణ కిరణం



పగలంతా తీక్షణ కిరణాలతో ప్రజలను బెంబేలెత్తించిన వెలుగుల రేడు సాయం సమయాన మబ్బులమాటుకు వెళ్తున్నాడు. అస్తమించే సూర్యుని అరుణ కిరణాలు తాకి మబ్బులు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. కాకినాడ జిల్లా తుని మండలం గవరపేటలో శుక్రవారం సాయంసంధ్యవేళ కనిపించిన ఈ మనోహరమైన దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

ఫొటో: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ



పొగాకు ఏ రూపంలో తీసుకున్నా అది మనిషి పతనానికి దారితీస్తుంది. తద్వారా అనారోగ్య కారణాలు ఏరికోరి తెచ్చుకున్న వారవుతారు. దీన్ని తాగడం వల్ల ఎన్నో రుగ్మతలు పొంచి ఉంటాయి. పొగాకు ఉత్పత్తులు కొనుక్కుని, వాటిని వాడాక రోగాలను కోరి తెచ్చుకోవడమే అవుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధుల బారిన పడక తప్పదు. నేడు జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

- పొగ తాగితే ఎన్నో దుష్ఫలితాలు
- సరదాగా ప్రారంభం... పొంచి ఉన్న ప్రమాదం
- ఏరికోరి రోగాలు తెచ్చుకోవడమే అంటున్న వైద్యులు
- ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధులకు కారణం
- నేడు అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినోత్సవం



ప్రాణాంతకం ధూమపానం

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పల్లెలు, పట్టణాలతో సంబంధం లేకుండా పొగతాగేవారు చాలాచోట్ల ఉన్నారు. కొందరు దీన్ని ఒకప్పుడు హుందా, దర్పానికి ఫ్యాషన్ అనుకునేవారు. ఇది కాస్త శ్రుతిమించి అలవాటుగా మారినవారు మానలేక అనారోగ్యం బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. సరదాగా మొదలుపెట్టిన సిగరెట్ కాలక్రమేణా కొందరిని ఖరీదైన మత్తు పదార్థాలవైపు ఉసిగొల్పుతోంది. విజ్ఞానాంశాల్లో యువకులు పోటీపడి ప్రావీణ్యం సంపాదిస్తున్నారు. ఏది మంచి, చెడు అనే విషయం అర్థం చేసుకుంటున్నారు. అన్నీ తెలిసి కూడా కొందరు పొగాకు సేవనానికి బానిసలవుతున్నారు. కొందరు ఈ రొంపి నుంచి బయట పడలేకపోతున్నారు.

కోట్లలో బానిసలు

ప్రపంచవ్యాప్తంగా పొగతాగే వారి సంఖ్య కోట్లలో ఉంది. దీనివల్ల పక్కనుండే వారు కూడా ఆరోగ్యపరంగా నష్టపోతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) దీనిపట్ల ఆందోళన వ్యక్తం చేస్తోంది. చాలా మంది పొగ తాగకుండా కాలకృత్యాలు తీర్చుకోరని ఓ సర్వే చెప్తోంది. ఇందులో మహిళలు కూడా ఉండడం విశేషం. ఇలా పొగ తాగడానికి ఎన్నో సాకులు చెప్తూ ప్రతిరోజూ ఒక్కో వ్యక్తి సగటున 150 గ్రాముల పొగాకును వారికి తెలియకుండానే శరీరంలోకి తీసుకెళ్తున్నారు. భారతదేశ స్థూల ఆదాయంలో



ఎగుమతుల ద్వారా అధిక ఆదాయం పొగాకు ఉత్పత్తుల ద్వారా లభిస్తోందని, ఇవే ఉత్పత్తులు దేశ మానవ వనరులను నాశనం చేస్తుందని స్పష్టం చేసింది. ప్రధానంగా 18 నుంచి 30 ఏళ్ల యువకులు సిగరెట్, పొగాకు అనుబంధ ఉత్పత్తులను తీసుకుంటూ చేజేతులా జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఇందుకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా సత్ఫలితాలు కనిపించట్లేదని లేదని వివరించింది.

చెడు అలవాట్లకు మార్గం

కుటుంబ వాతావరణం పిల్లలపై ప్రభావం చూపుతుంది. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు కూలి పనికి వెళ్తూ వెంట పిల్లల్ని తీసుకెళ్తుంటారు. తండ్రి ఖాళీ సమయంలో ఓ చుట్ట వెలిగిస్తాడు. దీన్ని గమనించిన పిల్లలు కొంత కాలానికి అదే ప్రయత్నం చేస్తారు. కానీ పిల్లలు చేస్తున్న ఆ పనిని తల్లిదండ్రులు అడ్డుకోరు. ఇదే అదనుగా వారు పెరిగి పెద్దవారయ్యాక ఖరీదైన సిగరెట్ల జోలికి వెళ్తారు. కళాశాలల్లో సిగరెట్‌లో ఉండే పొగాకు లాంటి పొడి (గంజాయి)ని వేసి దమ్ము పీల్చుతారు. తొలి ప్రయత్నంలో కొంతమంది యువకులు తేలికపాటి మత్తుకు చేరువవుతున్నారు. వక్కపొడి మాదిరిగా కనిపించే గుట్కా తినడానికి ఎక్కువ మంది యువకులు ఆసక్తి చూపిస్తున్నారు. వీటి విక్రయాలపై రాష్ట్ర ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా మార్కెట్లో బ్లాక్‌లో ఇవి దండిగా లభిస్తున్నాయి. పిల్లాడు సరదాగా సిగరెట్ తాగుతున్నాడని, తెలిసి ఊరుకుంటే, ఆ తర్వాత వచ్చే వ్యాధులను అరికట్టడానికి లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పొగాకు బానిసలైన వారికి ఊపిరితిత్తులు, గుండె, జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గుట్కా, పాన్‌మసాలా, జర్దా కిళ్లీ తీసుకోవడం ద్వారా నోటి, ప్లీహ కేన్సర్లు వస్తాయని, అవి మనిషి శరీరంలోకి అంత తేలిగ్గా ప్రవేశించవని, ప్రవేశిస్తే ఎన్ని మందులు తీసుకున్నా నిష్ప్రయోజనమేనని వారు హెచ్చరిస్తున్నారు.

ప్రమాదమని తెలిసినా..

సరదాగా ధూమపానం చేస్తే చాలు బానిస అవుతారు. పొగాకులోని నికోటిన్ అత్యంత వేగంగా రక్తంలోకి వెళ్లి ఏడు సెకన్లలోనే మెదడుకు చేరుతుంది. హెరాయిన్, కొకైన్, ఆల్కాహాల్ వంటి మత్తు పదార్థాల మాదిరిగానే పొగాకులోని నికోటిన్‌కు కూడా బానిసలుగా మార్చు



కునే గుణం ఉంటుంది. పొగాకును నిత్యం వాడడం వల్ల తీవ్ర ప్రమాదకారిగా మారుతుంది. పొగాకులోని నికోటిన్ రక్తనాళాలను పాడుచేయడంతో పాటు గుండెపోటుకు గురిచేస్తుంది. క్షయ, శ్వాస, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధుల బారిన పడేలా చేస్తుంది. 40శాతం వరకు కేన్సర్ వ్యాధులు పొగాకు వాడకం వల్లే వస్తున్నాయి. 90శాతం నోటి కేన్సర్లు పొగాకు సంబంధిత వాడకంతో సంభవిస్తున్నాయి. ధూమపానం చేసేవారి ఇళ్లల్లో పిల్లలకు వినికిడి తదితర సమస్యలు ఎదురవుతున్నాయి. మధ్య వయసులో ఉండి బీపీ, కొలెస్ట్రాల్ ఎక్కువ ఉన్నవారు ధూమపానం చేస్తే పదినుంచి 15 ఏళ్లకు ముందే మరణిస్తారని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది.



పొగతో వ్యాధులు

పొగాకు పొగ పీల్చగానే నేరుగా అది ఊపిరితిత్తుల్లోకి వెళ్లిపోతుంది. ముక్కుభాగంలో ఉండే ఆల్వియోలై అనే గాలి గది 28వ అంతస్థుగా ఉంటుంది. అక్కడే గాలి మార్పిడి జరుగుతుంది. అంటే స్వచ్ఛమైన ఆక్సిజన్ శరీరానికి అంది మలినమైన కార్బన్‌డైఆక్సైడ్ మార్పిడి ఆల్వియోలై అనే గాలి గదిలోనే జరుగుతుంది. కానీ పొగలో ఉండే కార్బన్‌మోనాక్సైడ్, సైనేడ్ వంటి విష పదార్థాల వల్ల ఆ గాలి గది స్వరూపమే మారిపోతుంది. వాస్తవానికి అక్కడ హిమోగ్లోబిన్ అనే వాహనం మీద ఆక్సిజన్ చేరి శరీరంలోని అన్ని కణాలకు అందాలి. కానీ పొగాకులోని విష పదార్థాల్లో ఉండే కార్బన్ మోనాక్సైడ్ హిమోగ్లోబిన్‌తో గాఢమైన బంధాన్ని ఏర్పాటు చేసుకుంటుంది. దాంతో రక్తంలోని హిమోగ్లోబిన్‌కు ఆక్సిజన్‌ను మోసుకుపోయే సామర్థ్యం తగ్గుతుంది. దీంతో శరీరంలోని అన్ని కణాలు కార్బన్‌మోనాక్సైడ్‌తో విషపూరితమై ఎన్నో వ్యాధులకు దారితీస్తుంది. దీనివల్ల కొద్ది దూరం కూడా మనిషి నడవలేని పరిస్థితి. కదిలితే నీరసం.. నడిస్తే ఆయాసం. ఎడతెరపి లేకుండా వచ్చే విపరీతమైన దగ్గు పొగాకులో ఉండే ఆక్రోలిన్ అత్యంత విష పదార్థం కారణంగా కలుగుతుంది.

సాగుకు సమాయత్తం

కర్ర పెండలం దుంప నాట్లు సీజను ప్రారంభం



రైతులు సేకరించిన నాణ్యమైన విత్తన కర్ర

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): కర్ర పెండలం దుంప సాగుకు మెట్ట ప్రాంత రైతులు సమాయత్తమయ్యారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ ఏడాది మే రెండో పక్షం నుంచే వాతావరణం చల్లబడి అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో కాకినాడ జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన పెద్దాపురం, సామర్లకోట, జగ్గంపేట, రంగంపేట, గండేపల్లి, ప్రత్తిపాడు, కిర్లంపూడిల్లో భూములను దుక్కి దున్నడం, నారుమడులకు పళ్లాలు కట్టడం, నాణ్యమైన కర్ర పెండలం దుంప కర్ర, విత్తనాల సేకరణ వంటి పనుల్లో రైతులు ముమ్మరంగా పాల్గొంటున్నారు. ఏటా జూన్ రెండో వారం నుంచి దుక్కి దున్నడం, నారుమడులు వేయడం చేసేవారు. అయితే ఈ ఏడాది వాతావరణం కర్ర పెండలం సాగుకు పూర్తి అనుకూలంగా మారడంతో రైతులు ఉత్సాహంగా ఉన్నారు. కాగా సగ్గు బియ్యం మిల్లర్ల నుంచి గిట్టుబాటు ధర లభించట్లేదనే కారణంతో కర్ర పెండలం దుంప సాగు విస్తీర్ణం కాలక్రమేణా తగ్గిపోతోందని మెట్ట రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లాభదాయకంగా ఉన్న పామాయిల్ తదితర పంటలవైపు మొగ్గు చూపుతున్నారు. ఈ కారణంగా దుంప దిగుబడులు ప్రతి సీజనుకూ తగ్గుతూ సగ్గుబియ్యం మిల్లులు వరుసగా మూతబడుతున్నాయి. ఐదేళ్ల క్రితం జిల్లాలో సుమారు 50వేల ఎకరాల్లో కర్ర పెండలం సాగు జరగ్గా గత ఏడాది కేవలం పది వేల ఎకరాలకు దిగజారింది. ఈ ఏడాది సాగుకు వాతావరణ పరిస్థితులు సానుకూలంగా ఉన్నప్పటికీ సగ్గు బియ్యం ఉత్పాదక వ్యయం పెరుగుదల, మార్కెట్లో ధరల తగ్గుదల వంటి అంశాలు కర్ర పెండలం సాగు పెరిగేందుకు ఎంత మాత్రం దోహదపడట్లేదని ఆంధ్రా శాగో మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. ఈ కారణంగా ప్రతి సీజన్లోనూ మిల్లులు మనుగడ సాగించలేకపోతున్నాయని చెప్పారు.



నారుమడులు (పళ్లాలు) కట్టిన దృశ్యం



అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్పొరేషన్ ఇంజనీరింగ్ వర్కర్స్

మా సమస్యలు పట్టవా!

- 24 రోజులుగా నిరసన తెలుపుతున్నా ప్రభుత్వం, అధికారుల్లో చలనం లేదు
- స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం: మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్లు

కార్పొరేషన్ (కాకినాడ), మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా తమ బతుకులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా వున్నాయని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు బత్తుల శివ పేర్కొన్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు చేపట్టిన సమ్మె 24వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కాకినాడ స్మార్ట్ సిటీ ఇంజనీరింగ్ కార్యాలయం ఎదుట అర్ధ నగ్న ప్రదర్శన చేశారు. 24 రోజులుగా నిరసన తెలుపుతున్నప్పటికీ ప్రభుత్వం కానీ, అధికారులు కానీ స్పందించకపోగా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కింది స్థాయి అధికారులు నామమాత్రపు చర్చలకు పిలిచినప్పటికీ పరిష్కారానికి చర్యలు తీసుకోవట్లేదన్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న తమకు తక్షణం వేతనాలు పెంచడంతో తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ విభాగం పనులు నిలుపుదల చేసి నీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి శ్రీధర్, యూనియన్ అధ్యక్షుడు ఏకల శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శంభుప్రసాద్, బత్తుల సత్యనారాయణ, పాలిక సత్యనారాయణ, మద్దూరి వీరభద్రరావు, జాడ అప్పలరావు, పి.నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఛత్తీస్‌గఢ్ డిప్యూటీ సీఎం రాక

- అహల్యాబాయి హోల్కర్ జయంతి వేడుకలకు అరుణ్ సావో హాజరు

రాజమహేంద్రవరం అర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం అరుణ్ సావో శనివారం రాజమహేంద్రవరం రానున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో హోటల్ మంజీరలో జరిగే అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు మంజీర హోటల్‌లో అహల్యాబాయి హోల్కర్ జయంతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అంతకు ముందు వై.జంక్షన్ నుంచి ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పాల్గొంటారన్నారు. అహల్యాబాయి జయంతిని పురస్కరించుకుని ఆమె చరిత్రపై ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్టు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పన్నాల లక్ష్మీసంతోష్ తెలిపారు.

2న కాకినాడ వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడలోని వికాస కార్యాలయంలో జూన్ 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. వివిధ కంపెనీల్లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ మేనేజర్, హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్, వేర్ హౌస్ మేనేజర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన 35సంవత్సరాలలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేల నుంచి రూ.30వేల వరకు జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరును సంప్రదించాలని సూచించారు.

రేపు రాజమహేంద్రవరంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఓపెన్ చదరంగం పోటీలను ఆదివారం రాజ మహేంద్రవరం మెయిన్‌రోడ్డులోని రత్న ప్యాలెస్ దగ్గర గల ఐరన్ అండ్ హార్డ్ వేర్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో నిర్వహిస్తున్నట్టు సంఘం కార్యదర్శి జి.రవికుమార్ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన మొదటి నలుగురు విజయవాడలో జూన్ 7, 8 తేదీల్లో జరిగే సీనియర్ మెన్ రాష్ట్ర చదరంగం పోటీలకు మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ పేర్లను ఏపీచెస్.ఓఆర్‌జీ అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని, పూర్తి వివరాలకు 9848374133 నెంబరును సంప్రదించాలని రవికుమార్ కోరారు.

మేలైన వైద్య సేవలందించండి

- తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీలక్ష్మి



వైద్య సదుపాయాలు, సేవలపై వైద్యులను ఆరా తీస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీలక్ష్మి

రాజానగరం, మే 30 (ఆంధ్రజ్యోతి): మానసిక రుగ్మతల నుంచి పూర్తిగా ఉపశమనం పొందిన వారిని తిరిగి వారి కుటుంబ సభ్యులతో కలిపేందుకు తగు చర్యలు తీసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి వైద్యులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో గల మానసిక చికిత్స కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆ విభాగంలో చికిత్స పొందుతున్న వారితోను, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. వైద్యుల సలహాలు పాటిస్తూ తగు జాగ్రత్తలు పాటిస్తే త్వరగా కోలుకోవచ్చని రోగులకు సూచించారు. చికిత్స పొందుతున్న వారి వివరాలు, అందుతున్న సేవలు, వైద్య సదుపాయాలు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విషయంలో ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తామని చెప్పారు.

రక్షణకు వేద్దాం 'టూ స్టెప్స్'

- వాట్సాప్‌లో మార్చుకోవాల్సిన సెట్టింగ్‌పై పోలీసుల అవగాహన
- సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండాలని సూచన

శంఖవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడికి చెందిన ఓ యువకుడికి ఇటీవల వాట్సాప్ ద్వారా ఫోన్ వచ్చింది. హిందీలో మాట్లాడటంతో ఫోన్ కట్ చేశాడు యువకుడు. వెంటనే రూ.5 వేలు పంపాలని లేకపోతే నీ కాంటాక్ట్ లిస్టులో ఉన్నవాళ్లందరికీ నీ నగ్న ఫొటోలు పంపుతానని బెదిరింపులు వచ్చాయి. భయంతో పోలీసులను ఆశ్రయించాడు యువకుడు. ఇలా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వందల సంఖ్యలో యువతీ, యువకులు ఇబ్బందులు పడుతున్నారు. కొందరు పోలీసులకు ఫిర్యాదులు చేస్తుంటే మరికొంతమంది భయంతో సైబర్ నేరగాళ్లు చెప్పినట్టు డబ్బులు పంపుతున్నారు. ఇంతకీ మనం ఫోన్‌లో ఉండే కాంటాక్ట్ లిస్టులో ఉన్న వివరాలు అవతలి వ్యక్తికి ఎలా వెళ్తాయే తెలుసా? వాట్సాప్‌లో ఉన్న ఓ సెట్టింగ్ ఆన్ చేసుకోకపోవడమే అందుకు కారణం. ఇదే సైబర్ దొంగలకు వరంగా మారింది. వాట్సాప్‌లో టూ స్టెప్ పిన్ యాక్టివేట్ చేసుకోని యువతను టార్గెట్‌గా చేసుకుని ఫోన్ కాల్ చేసి వారి కాంటాక్ట్ లిస్టులో వ్యక్తులకు మార్ఫింగ్ ఫొటోలతో బెదిరింపులకు దిగుతున్నారు దుండగులు. అయితే సెట్టింగ్‌లను మార్చుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.



సెట్టింగ్‌ను మార్చుకోండిలా...

- తొలుత వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లండి
- ఖాతాపై క్లిక్ చెయ్యండి
- టూ స్టెప్ ఆప్షన్‌పై క్లిక్ చేయండి
- మీ పిన్‌ను నమోదు చెయ్యండి
- మీ ఈమెయిల్ చిరునామా నమోదు చేసి సేవ్ చేయండి

అవగాహన ఉండాలి

ప్రతీ ఒక్కరూ సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలి. వాట్సాప్‌ను వినియోగించే ప్రతీ ఒక్కరూ టూ స్టెప్ వెరిఫికేషన్ చేసుకోవాలి. టూస్టెప్ పిన్ నమోదు చేసుకున్న వాట్సాప్‌ను హ్యాక్ చేయాలంటే వాట్సాప్ టూ స్టెప్ వెరిఫికేషన్ అడుగుతుంది. ఓటీపీ లేకుండా వాట్సాప్ హ్యాక్‌చేయడం కుదరదు.


ప్రత్తిపాడు సీఐ బి. సూర్యఅప్పారావు

రైలు టిక్కెట్ల బుకింగ్‌లో ఇక్కట్లు

ఐఆర్‌సీటీసీ వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌లో సాంకేతిక సమస్యలు

సామర్లకోట, మే 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పోరేషన్(ఐఆర్‌సీటీసీ) వెబ్‌పోర్టల్, మొబైల్ యాప్‌లు ఇటీవల కొద్దిరోజులుగా తరచూ క్రాష్ అవుతుండడంతో యూజర్లను లాగిన్ కానీయడం లేదు. ఒక్కో సమయంలో లాగిన్ అయినా టిక్కెట్లు బుకింగ్ చేసుకునేందుకు సాంకేతిక సమస్య ఏర్పడుతుంది. జనరల్ టిక్కెట్ల బుకింగ్‌లోనే ఇలాంటి పరిస్థితి కొనసాగుతుండగా తత్కాల్ టిక్కెట్ల బుకింగ్ సమయంలో చుక్కలు చూపిస్తుందని పలువురు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి సమస్య లేదని యూజర్లు వాపోతున్నారు. ప్రధానంగా మీ ఇంటర్నెట్ కనెక్టివిటీని చెక్ చేసుకోమంటూ ఎర్రర్ సందేశం వస్తుంది. మొబైల్ ఇంటర్నెట్, వైఫై, బ్రాడ్ బ్యాండ్ సేవలు బాగానే ఉన్నప్పటికీ ఇదే సమస్య ఉత్పన్నవుతుందని పలువురు వాపోతున్నారు.

ఇతర యాప్‌ల దోపిడీ

ఐఆర్‌సీటీసీ యాప్, వెబ్ పోర్టల్ రైల్వే టిక్కెట్ల బుకింగ్‌కు మొరాయిస్తుండడంతో యూజర్లు గత్యంతరం లేక వేరే యాప్‌ల ద్వారా అదనపు సర్వీసు చార్జీలు చెల్లించి టిక్కెట్లు బుకింగ్ చేసుకోవాల్సివస్తుంది. ఇదే సమయంలో టిక్కెట్ల చార్జీపై అదనంగా రూ.50 చెల్లిస్తే ఒక వేళ క్యాన్సిలేషన్ చేసుకున్నా ఫుల్ రిఫండ్ చేస్తామంటూ వల విసురుతున్నారు. అదే ఏసీ టిక్కెట్లకు, త్రీటైర్ టిక్కెట్లకు అయితే రూ.127, సెకండ్ ఏసీ అయితే రూ.177, ఫస్టు ఏసీకి రూ.295 చెల్లిస్తే త్రీటైర్ టిక్కెట్టు క్యాన్సిల్ చేసుకున్నా పూర్తి రిఫండ్ చేస్తామంటున్నాయి. ఈ విధంగా ప్రయాణికులను ఇతర యాప్‌లు దోపిడీ చేస్తున్నాయని వారు వాపోతున్నారు.

'స్పేసెస్' డిగ్రీ కళాశాలకు అటానమస్ స్టేటస్


స్టేటస్ ఆర్డర్‌ను చూపిస్తున్న విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

తుని రూరల్, మే 30 (ఆంధ్రజ్యోతి): శ్రీప్రకాష్ అనుబంధ సంస్థలైన స్పేసెస్ డిగ్రీ కళాశాల యూజీసీ (యూనివర్సిటీ గ్రాండ్స్ కమిషన్) నుంచి స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్ స్టేటస్) పొందినట్టు కళాశాల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయప్రకాష్ తెలిపారు. ఈ హోదా దశాబ్ద కాలానికి వర్తిస్తుందని, ఈ హోదా సొంతం చేసుకోవడంతో కళాశాలలోనే సొంతంగా కోర్సులు రూపొందించుకుని, సిలబస్ అభివృద్ధి చేసుకోవడంతో పాటు పరీక్షల నిర్వహించి ఫలితాలు వెల్లడించే అవకాశం కలుగుతుందన్నారు. స్వయం ఉపాధి, స్వావలంబన అనే ధ్యేయంతో పనిచేస్తున్న ఈ విద్యాసంస్థకు ఈ ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం వల్ల గ్రామీణ విద్యార్థులకు ఉన్నత విద్యా ప్రమాణాలు, ఉపాధి అవకాశాలు మరింతగా అందుబాటులోకి వస్తాయని విజయ్‌ప్రకాష్ తెలిపారు. స్వయం ప్రతిపత్తి ద్వారా విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపర్చే దిశగా కట్టుబడి ఉన్నట్టు శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రెసిడెంట్ కె.నరేంద్రబాబు, కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ సీహెచ్ వికె.నరసింహారావు తెలియజేసారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, సిబ్బంది సహా ఈ ఘనత సాధనలో భాగస్వామైన ప్రతిఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తిని గాయపర్చిన ముగ్గురిపై కేసు

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి దాడి చేసి గాయపర్చిన సంఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జి.జి. ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ షాన్‌బాషా ఈ నెల 28వ తేదీన పట్టణంలో సాయి చికెన్ షాపు వద్ద ఉండగా సాయి, రాజేష్, చందులు వచ్చి ఘర్షణ పడి దాడి చేశారు. కాలర్ పట్టుకుని కొట్టి గాయపర్చారు. గాయపడిన షాన్ బాషాను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు షాన్ బాషా ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు.

మరో ఘటనలో..

వ్యక్తిని కొట్టి గాయపర్చిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ ఏఎస్‌ఐ జిజి. ప్రకాష్ తెలిపారు. వివరాల ప్రకారం.. కొవ్వూరు పట్టణానికి చెందిన కొనకళ్ల అంజి ఈనెల 28వ తేదీన చికెన్‌షాపు శివ ఇంటిలో శుభకార్యానికి వెళ్లాడు. భోజనాలు వడ్డించే సమయంలో షాన్‌బాషాకు, అంజికి మధ్య వివాదం ఏర్పడింది. ఈ ఘటనలో అంజికి గాయాలు కావడంతో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు అంజి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ జి.జి.ప్రకాష్ తెలిపారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

WANTED

★ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ని, పిల్లలను చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు కావలెను. ఏజెంట్స్ కూడా కావలెను. జీతం: 15k, ఏజెంట్ కమిషన్: 5k. ఫోన్: 8977517749 AJH-6753

4 Lines CLASSIFIED Rs.230/- Only

కలెక్టర్ రకం.. చిలుక ఆకారం..

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలోని ఓ మామిడి రైతు తోటలో మామిడికాయ వినూత్న ఆకారంలో కనిపించింది. స్థానిక రైతు గొనగాల గోపి మామిడి తోటలో కలెక్టర్ రకం మామిడి చెట్టు నుంచి దిగుబడికొచ్చిన ఈ మామిడికాయ చిలుక ఆకారంలో శుక్రవారం ప్రత్తిపాడు మార్కెట్‌కు రావడంతో దానిని ఆసక్తిగా తిలకించారు.


చిలుక ఆకారంలో ఉన్న మామిడికాయ

రత్నగిరిపై యోగాంధ్ర

హాజరైన కాకినాడ జిల్లా జేసీ, టూరిజం ప్రాజెక్ట్ డైరెక్టర్ చైతన్యవర్షిణి

అధిక సంఖ్యలో పాల్గొన్న ఉద్యోగులు, భక్తులు, గ్రామస్థులు




యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, భక్తులు, ఉద్యోగులు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ 11వ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, టూరిజం ప్రాజెక్ట్ డైరెక్టర్ చైతన్యవర్షిణి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఉదయం 8గంటలకు ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు, భక్తులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, నిత్యం యోగాసనాలు వేయడం ద్వారా నూతనుత్తేజం పొందుతారని పేర్కొన్నారు. ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు మాట్లాడుతూ ప్రాచీన భారతీయ సంప్రదాయం అమూల్యమైన సంపదగా యోగాను అభివర్ణించారు. చిన్నారులకు ఏకాగ్రత కల్పించడంలోను, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి యోగాసనాలు ద్వారా ఉపశమనం పొందవచ్చునన్నారు. దేవస్థానం వ్రతపురోహితులు, నాయిబ్రాహ్మణులు, శానిటరీ సిబ్బందితో పాటుగా సుమారు 1000 మంది యోగసనాలను వేశారు.

సత్యదేవుడి సన్నిధిలో
పాట్నా హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడి సన్నిధిలో శుక్రవారం పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ రాయ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో వారికి స్వామి వారి మెమెంటో, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒక దాత రూ1,00,116లు విరాళంగా సమర్పించారు. బెంగుళూరుకు చెందిన నడింపల్లి ఎస్‌వి ఎస్‌రాజు, నాగదేవి దంపతులు ఈ మొత్తాన్ని ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను అభినందించి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.


ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ఘనంగా చండీహోమం

సత్యదేవుడి ఆలయ రక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9 గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


పాట్నా హైకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి మెమెంటో అందజేస్తున్న ఈవో


కార్యకర్తను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

నిరసన సమయంలో... అంగన్‌వాడీ కార్యకర్తకు అస్వస్థత

శంఖవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): తనను అన్యాయంగా విధుల్లో నుంచి తొలగించారని నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త అస్వస్థతకు గురైంది. అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎటువంటి సమాచారం లేకుండా తనను ఉద్యోగం నుంచి తొలగించాని ఈనెల 27 నుంచి కాకినాడ జిల్లా శంఖవరం ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు రౌతులపూడి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన పద్మ నిరసన వ్యక్తం చేస్తున్న విషయం విధితమే. అయితే శుక్రవారం ఉదయం యాథావిధిగా నిరసనకు కూర్చున పద్మ ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. దీంతో యూనియన్ సభ్యులు అంబులెన్స్‌లో రౌతులపూడి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతుందని, ఉద్యోగం ఏమైపోతుందోనని ఆవేదనతో 4 రోజులుగా ఏమి తినకపోవడంతో నీరసించిపోయినట్లు యూనియన్ సభ్యురాలు బుల్లెమ్మ తెలిపారు. వెంటనే పద్మను విధుల్లోకి తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రంగా విగ్రహం చేతులు విరగ్గొట్టిన వ్యక్తి అరెస్టు

కొత్తపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): కాపు పోరాట యోధుడు వంగవీటి మోహనరంగా విగ్రహం చేతులు విరగ్గొట్టిన వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ తెలిపారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి ఊరచెరువు సెంటర్లో రంగా విగ్రహం చేతులు విరగ్గొటడంపై జనసేన, రంగా యూత్ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టిన విషయం విధితమే. ఆందోళనకారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాకినాడ జిల్లా కొత్తపల్లికి చెందిన పి.శ్రీకాంత్‌ను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ చెప్పారు.

మద్యం మత్తులో హల్‌చల్ చేసిన యువకుడి అరెస్ట్

జగ్గంపేట, మే 30 (ఆంధ్రజ్యోతి): తాగిన మైకంలో రహదారి మధ్యన నిలబడి ఇతర వాహనాలకు ఆటంకం కలిగించిన యువకుడిని జగ్గంపేట పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల టౌన్‌కు చెందిన ఇస్మాయిల్ కాకినాడ జిల్లా జగ్గంపేటలో గురువారం రాత్రి బాగా మద్యం తాగి రోడ్డు మీదకు వచ్చాడు. వాహనాలను అడ్డుకుని ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. దీనిపై సమాచారం రావడంతో పోలీసులు అతడిని అరెస్టుచేశారు.

విశాల్ మార్ట్‌లో తప్పిన పెను ప్రమాదం

గ్యాస్ ఒత్తిడితో పేలిన ఏసీ

టెక్నీషియన్‌కు తీవ్రగాయాలు

రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): విశాల్ మెగా మార్ట్‌లో పెను ప్రమాదం తప్పింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లాలా చెరువు సమీపంలో విశాల్ మార్ట్‌ని గురువారం ప్రారంభించారు. శుక్రవారం రాత్రి 9గంటల సమయంలో మూడో ఫ్లోర్ వెనుక భాగంలో 8.5టన్నుల ఏసీకి సంబంధించిన ఔటర్ యూనిట్ (బ్లోయర్)లోని గ్యాస్ ఒత్తిడిని టెక్నీషియన్ చెక్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. ఆ దాటికి టెక్నీషియన్ మూడో ఫ్లోర్ నుంచి ఇనుప మెట్లపై రెండో ఫోర్‌లోకి పడిపోయాడు. చేతులు, కాలి తీవ్ర గాయాలయ్యాయి. తొలుతగా ప్రభుత్వాస్పత్రికి తర్వాత మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే 4 ఫ్లోర్లలోనూ నిండుగా సరుకు ఉండడంతోపాటు ప్రమాదం జరిగిన సమయంలో మార్ట్‌లో జనం, సుమారు 30 మంది సిబ్బంది ఉన్నారు. లోపలికి మంటలు వ్యాపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. కాగా ఏసీ టెక్నీషియన్ ఎప్పుడు వచ్చి చెక్ చేసుకుంటున్నాడో తమకు తెలియదని మార్ట్ సిబ్బంది చెప్పడం గమనార్హం. అయితే ఆస్తి నష్టం అంచనా వేయాల్సి ఉంది.


మార్ట్ వద్ద పరిశీలిస్తున్న పోలీసులు

అన్నవరం దేవస్థానం ఏఈవోకు విభాగం మార్పు

ఈవో షోకాజు నోటీసులు

అన్నవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి శ్రీపుష్పయోగం రోజున మహిళా భక్తురాలిపై ఆలయ ఏఈవో కొండలరావు అసభ్యంగా ప్రవర్తించారని సీఎంవోకు ఓ భక్తుడు ఫిర్యాదు చేసిన సంఘటనపై అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు చర్యలకు ఉపక్రమించారు. దీనిలో భాగంగా కొండలరావును ఆలయ విభాగం నుంచి గార్డెన్ విభాగానికి మార్చి పాలంకి జగ్గారావుకు ఆలయ ఏఈవో బాధ్యతలు అప్పగిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. దీంతో పాటుగా కొండలరావుకు షోకాజు నోటీసులు జారీ చేసి 5 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నెలలో కొండలరావు రెండోసారి షోకాజు నోటీసులు అందుకోవడం కొసమెరుపు. అలాగే వచ్చేనెలాఖరికి పదవీ విరమణ చేయనున్నారు.

అనాతవరంలో తాచుపాము హల్‌చల్

ముమ్మిడివరం, మే 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అనాతవరం శివాలయం వీధికి చెందిన సుదర్శనం వెంకటసీతారామాచార్యుల ఇంట్లోకి తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. దీంతో చట్టుపక్కలవారు, ఇంటి యజమాని భయభ్రాంతులకు గురయ్యారు. ఆ ఇంటి షెడ్డుపైకి తాచుపాము చేరి 4 రోజులుగా నివాసం ఏర్పరుచుకుంది. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం అతడు తాచును చాకచక్యంగా బంధించి తీసుకెళ్లాడు. పామును అటవీ ప్రాంతంలో వదులుతానని వర్మ తెలిపాడు.


తాచుపామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్‌వర్మ

లారీని ఢీకొన్న ఐషర్ వ్యాన్

అక్కడికక్కడే డ్రైవర్ మృతి


నుజ్జునుజ్జు అయిన ఐషర్‌వ్యాన్

దేవరపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా ఐషర్ గూడ్స్‌వ్యాన్ ఢీకొన్న ఘటనలో ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం రాజమహేంద్రవరం వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఐషర్‌వ్యాన్ దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలో ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో ముందు క్యాబిన్ భాగం పూర్తిగా నుజ్జునుజ్జు అయ్యి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందినట్టు ఎస్‌ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ వాహనం తమిళనాడుకు చెందినదని గుర్తించినట్టు చెప్పారు. మృతదేహాన్ని గోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మార్చురీకి తరలించినట్టు ఆయన తెలిపారు. అయితే మరణించిన డ్రైవర్ పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


క్యాబిన్‌లో మృతిచెందిన డ్రైవర్

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రత్తిపాడు, మే 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు 16వ నెంబరు జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం బొల్లువారి వీధికి చెందిన బొల్లు రాజేష్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ధర్మవరం, వన్నెపూడి జాతీయ రహదారిపై వస్తుండగా రాజేష్ మోటార్‌బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైందా లేదా ఏదైనా వాహనం ఢీకొందా అనే విషయం తెలియాల్సి ఉంది. గాయపడిన రాజేష్‌ను ప్రత్తిపాడు ఆసుపత్రికి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.


గాయపడిన రాజేష్

గంజాయితో ఆరుగురి అరెస్టు

15 కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం

మోతుగూడెం, మే 30 (ఆంధ్రజ్యోతి): సీలేరు నుంచి గంజాయిని తరలిస్తున్న ఆరుగురు నిందితులను మోతుగూడెంలో ఎస్‌ఐ సాదిక్, సిబ్బంది, సీఆర్పీఎఫ్ బెటాలియన్‌లు పట్టుకున్నారు. వారి నుంచి 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సూర్యాపేటకు చెందిన ఎస్.హరికృష్ణ, పిడుగురాళ్లకు చెందిన కె.నవీన్, ఎస్.రాజేష్, తిరువూరుకు చెందిన కె.సిద్ధు, సీహెచ్ సురేష్‌తోపాటు మరో వ్యక్తి సీలేరు నుంచి తెలంగాణకు గంజాయిని తీసుకెళ్తున్నారు. మోతుగూడెంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా శుక్రవారం దొరికారు. 15కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.


గంజాయితో పాటు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

అరగుండు చేయించుకున్న జగన్ అభిమాని

తూర్పుగోదావరి జిల్లా ఊనగట్లలో ఘటన

ఆలస్యంగా వెలుగులోకి

చాగల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): స్నేహితులకు ఇచ్చిన మాట ప్రకారం జగన్ ఓటమి చెందినందుకు ఆయన అభిమాని అరగుండు చేయించుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలంలో ఈనెల 25న ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలివి. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన వీరవల్లి శివ వైసీపీ కొవ్వూరు నియోజకవర్గం సోషల్ మీడియా కోకన్వీనర్‌గా వ్యవహరించేవాడు. ఎన్నికల సమయంలో వైసీపీ గెలుపు ఖాయమని చాలా ధీమా వ్యక్తం చేశాడు. జగన్ ఓడిపోతే అరగుండు చేయించుకుంటానని పందెం కాశాడు. దీంతో జగన్ ఓటమి చెంది సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 25న ఆదివారం సాయంత్రం అతడు అరగుండు చేయించుకుని ఊనగట్ల సెంటర్‌లో కొద్దిసేపు తిరిగాడు. కాగా ఈ విషయం బయటకు పొక్కలేదు. శుక్రవారం ఈ విషయం తెలియడంతో ఆంధ్రజ్యోతి అతడిని పలకరించింది. ముఖ్యమంత్రిగా జగన్ అమలు చేసిన పథకాలు ఆయనను గెలిపిస్తాయని నమ్మానని, కానీ ప్రజలు వైసీపీని తిరస్కరించారని, జగన్ ఓడిపోవడంతో స్నేహితులకు ఇచ్చిన మాట కోసం అరగుండు చేయించుకున్నానని వీరవల్లి శివ బదులిచ్చాడు.


అరగుండుతో వీరవల్లి శివ

ఒక రోజు ముందే పెన్షన్ల పంపిణీ

కోరుకొండ, మే 30(ఆంధ్రజ్యోతి): జూన్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఈనెల 31వ తేదీ ఉదయం 7గంటలకే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని ఈ మేరకు పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని గ్రామ, వార్డు సచివాలయాలకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పేర్కొన్నారు.

జూన్‌లో జగన్ జైలుకి వెళ్లడం ఖాయం

● కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే


సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ కుంభకోణంలో భారీ అవినీతికి పాల్పడ్డ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి జూన్ నెలలో జైలుకు వెళ్లడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ లిక్కరులో చేసిన అవినీతి, దోపిడీకి సం బంధించిన అధారాలను ఆ పార్టీకి చెందిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి స్వయంగా టీడీపీ ప్రభుత్వానికి అప్పగించారని ఆరోపించారు. ఇప్పటికే జగన్ గురించి విజయసాయిరెడ్డి బహిరంగంగానే విమర్శిస్తున్నారని చెప్పారు. జగన్‌పార్టీ పెట్టినప్పుడు కాంగ్రెస్‌ను వీడి వెళ్లిపోయిన నాయకులు నిజాయితీగా ఉన్నవా రు ఉన్నారని అటువంటి వారు ఇప్పుడు జగన్ జైలుకు పోతే తమ భవిష్యత్ ఏమిటోనని ఆందోళన చెందుతున్నారని, అటువంటి నిజాయితీపరులకు కాంగ్రెస్ అండగా ఉందని వారంతా కాంగ్రెస్‌లోకి తిరిగి రావాలని పిలుపునిచ్చారు. మరోపక్క రాష్ట్రంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వెనుకబడి ఉండి, జగన్ కోసమే విమర్శిస్తూ పక్కకిపోయిన జగన్‌కు తిరిగి ఆక్సిజన్ ఇస్తున్నారని అన్నారు. ముందు సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. గతంలో కాపులను తన అన్న మోసం చేస్తే ఇప్పుడు తమ్ముడు కాపులను మోసం చేస్తున్నాడని అత నిని నమ్మి కాపులు అంతా కూటమిని గెలిపిస్తే ఇప్పుడు పవన్ తీరు మోసపూరితంగా ఉందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పా ర్టీ నగర అధ్యక్షుడు అబ్దుల్లాషరీఫ్, పీసీసీ సభ్యుడు కిషోర్‌జైన్, జిల్లా ఎస్సీసెల్ నాయకులు బత్తిన చంద్రరావు, యువజన కాంగ్రెస్ జి ల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకులు కోడి నాగుల పట్టాభి, మైనార్టీ నాయకులు జావిద్ అత్తర్, ఆలీ పాల్గొన్నారు.

సీతారాములను దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల


సీతారాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

కోరుకొండ, మే 30 (ఆంధ్రజ్యోతి): రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ శుక్రవారం కణుపూరులో సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోజువారి కార్యక్రమాలకు హాజరయ్యే ముందు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు డాక్టర్ అడపా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

● ఉపకులపతుల వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోనశశిధర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, యోగాసనాలు వేస్తున్న జేసీ చిన్నరాముడు

దివాన్‌చెరువు, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమాలను రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సమిష్టిగా భాగస్వామ్యమై విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ అన్నారు. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు వీసీలతో యోగాంధ్ర కార్యక్రమంపై ఆన్‌లైన్ సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని రెండు కోట్లమందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. జూన్ 21న విశాఖపట్నంలో 5లక్షల మందితో అతిపెద్ద యోగాకార్యక్రమంను నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్రంలోని అన్నివిశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విద్యారులను, వివిధ దేశాలలో పూర్వ విద్యార్థులను భాగస్వామ్యం చేయాలని చెప్పారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.మధుమూర్తి, కమీషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నారాయణ భరత్‌గుప్తా మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఆదికవి నన్నయ వీసీ ఆచార్యప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి నన్నయ విశ్వవిద్యాలయం యోగాంధ్ర కార్యక్రమాలను ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ విధానంలోనూ నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని నన్నయ అనుబంధ కళాశాలలకు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సర్క్యులర్ విడుదల చేశామని చెప్పారు. విశ్వవిద్యాలయంలోని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, కుటుంబాలతో వివిధ కేటగిరీలుగా విభజించి యోగాంధ్ర కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో కమిషనరేట్ ఆఫ్ కాలేజీయేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, ఓ.ఎస్.డి. ఐటికవిత, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు, రిజిస్ట్రార్‌లు పాల్గొన్నారు.

యోగాంధ్ర విజయవంతం చేయాలి: జేసీ

రాజమహేంద్రవరం అర్బన్ : యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని జీఎస్‌టీ రోడ్డులో యోగా అభ్యాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ పాల్గొని మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం అయిన జూన్ 21వ తేదీ వరకూ ఈ యోగాంధ్ర కార్యక్రమం కొనసాగుతుందని అన్నారు. ఆరోజున ఎక్కువమంది యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ విద్యార్థిని సాత్విక యోగాసనాల ప్రదర్శన ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా అయుష్ అధికారి డాక్టర్ కె.రమేష్, యోగాంధ్ర జిల్లా నోడల్ అధికారి పి.కాజియా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది యోగాసనాలు

కోరుకొండ: కోరుకొండ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం తహసీల్దార్ సుస్వాగతం, సిబ్బంది యోగాసనాలు వేశారు. యోగా టీచర్ రహీమాబేగం రెవెన్యూ సిబ్బందితో యోగాసనాలు వేశారు. ప్రధాని నరేంద్రమోదీ కృషి మేరకు ఆరోగ్యమే మహాభాగ్యం నినాదంతో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు.

'ప్రత్యేకావసరాల పిల్లలను భవిత కేంద్రంలో చేర్చాలి'

బిక్కవోలు, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రత్యేకావసరాల పిల్లలను బిక్కవోలులోని భవిత కేంద్రంలో చేర్పించాలని ఐఆర్‌పీ సన్యాసిరావు తల్లిదండ్రులను కోరారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈపిల్లల నమోదుపై సర్వే చేపట్టామని తెలిపారు. ఇప్పటివరకూ 9 మంది చిన్నారులను గుర్తించామని వీరిని భవిత కేంద్రంలో చేర్చి మానసికంగాను, శారీరకంగాను ఉత్తేజపరిచే విధంగా విద్యాబోధన చేసి ప్రభుత్వపథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. సర్వేను జూన్ 9వ తేదీ వరకూ నిర్వహిస్తామని ఐఆర్‌పీ వివరించారు.

'గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి'

రాజానగరం, మే 30(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణంలో పాడి పశువులు అంతుచిక్కని వ్యాధులకుగురై అనారోగ్యం బారిన పడుతున్నాయని, పశు వైద్య శిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు అధికా రులను వేడుకుంటున్నారు. పశువుల శరీరంపై బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారి నీరసించిపో తున్నాయన్నారు. లేగదూడలు సైతం ఈవ్యాధు లకుగురై మృత్యువాత పడుతున్నాయన్నారు. పశు వైద్యాధికారులు స్పందించి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించి, రోగాలబారిన పడుతున్న పశుసంపదను కాపాడాలని మండ లంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు.

ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే అభివృద్ధి

● ప్రకాష్‌నగర్‌లో రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే వాసు


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మే 30(ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలో ప్రకాష్‌నగర్‌లో రూ. కోటి36లక్షలతో నిర్మిస్తున్న రహదారిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పరిశీలించారు. శుక్రవారం ఉదయం స్థానిక 8వ డివిజన్‌లో చేపట్టిన రహదారి పరిశీలనలో ఆదిరెడ్డి వాసు మాట్లాడారు. నగర ప్రజల ఆలోచనలకు అనుగుణంగానే అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ప్రకాష్‌నగర్ ఎపెక్స్ ఆసుపత్రి వద్ద నుంచి 805 మీటర్ల మేర రహదారిని నిర్మిస్తున్నామన్నారు. ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం ఎవ్వరికీ ఇబ్బందిలేకుండా పనులు చేసుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. రాజమహేంద్రవరం ప్రజల ఆలోచనకు తగ్గట్టుగా నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. నగర ప్రజల 15 ఏళ్ల కలకు సాకారం అందించి కార్యరూపంలోకి తీసుకువచ్చి గోదావరి రివర్‌ఫ్రంట్ నిర్మాణం చేస్తున్నామన్నారు. మొత్తం రూ.22కోట్లతో రివర్‌ఫ్రంట్ పూర్తవుతుందని చెప్పారు. గోదావరిగట్టున ఉన్న మహనీయుల విగ్రహాలకు మరింత శోభ చేకూర్చే విధంగా అభివృద్ధి చేస్తామని ఆదిరెడ్డి వాసు చెప్పారు. మాజీ కార్పొరేటర్ వర్రే శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు రాఘవరావుకి ఎమ్మెల్యే అభినందన


ఉపాధ్యాయుడు రాఘవరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మే 30 (ఆంధ్రజ్యోతి) : వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డుతోపాటు ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఎలైట్ బుక్ ఆఫ్ రికార్డ్సులలో రికార్డులు సాధించిన అనపర్తి మండలం కుతుకులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు రాఘవరావును శుక్రవారం అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి రామవరంలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. తెలుగు ఉపాధ్యాయుడిగా పాఠ్యపుస్తక రచయితగా, రాష్ట్ర విద్యా బోధన పరిశోధన శిక్షణా మండలి విషయ నిపుణుడిగా వ్యవహరిస్తూ ఏపీ ప్రభుత్వంలో ఎస్‌సీఈఆర్‌టీ, ఎస్ఎస్‌ఏ దీక్ష ద్వారా పాఠశాల విద్యార్థులకు వీడియోలు చేసి అందించడమే కాకుండా, ప్రముఖ వ్యక్తుల జీవితాలను, ముఖ్య సంఘటనలను, పర్వదినాల ప్రా ముఖ్యతను తెలియజేసే పాటలు రాయడంతో పాటు వాటికి స్వరం సమకూర్చి, వీడియో ఎడిటింగ్ చేసి అతితక్కువ కాలంలో అందించి నందుకు ఆయన ఈ రికార్డులను సొంతం చేసుకున్నారు. ఒకేసారి మూడు రికార్డులు సాధించడం పట్ల ఎంతో ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా రాఘవరావును ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, సర్పంచ్ గొల్లు హేమతులసి, నీటిసంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, కూటమి నాయకులు పులగం తిరుమల రెడ్డి అభినందించారు.

సమరశీల పోరాటాలు, ఉద్యమాలే సీఐటీయూ అజెండా

● 55వ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

రాజమహేంద్రవరంఅర్బన్, మే 30 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కత్తాలో 1970ల నాటి రైల్వే సమ్మె మొదలుకుని నేటి విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ వరకూ సీఐటీయూ ఎన్నో సమరశీల పోరాటాలు, ఉద్యమాలు సాగించిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్, జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలో సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం, దివంగత సీఐటీయూ జిల్లా నాయకుడు రాజులోవ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సభలో రాజులోవ చిత్రపటానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి బి.పవన్, టి.అరుణ్, ఎస్ఎస్ మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్‌కోడ్స్‌ను తీసుకొచ్చిందని అన్నారు. లేబర్‌కోడ్స్ రద్దయ్యే వరకూ రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. ఈ సభలో జిల్లా నాయకులు పూర్ణిమరాజు, వై.బేబీరాణి, ఎం.వెంకటలక్ష్మి, పడాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగించాలి

కమిషనర్ కేతన్ గార్గ్


నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ-ఆటో మేళా

రాజమహేంద్రవరం సిటీ, మే30(ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ కోసం ఎలక్ట్రికల్ వాహనాలు వినియోగాన్ని పెంచుకోవాలని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ-ఆటో మేళాలో కమిషనర్ కేతన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బజాజ్, మహీంద్రా, ఏపీటీయాగ్నో కంపెనీలకు సంబంధించిన ఈ-వాహనాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి ఎలక్ట్రికల్ వాహనాల కొనుగోలుదార్లను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమన్నారు. మెప్మా ఆధ్వ ర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున దరఖాస్తులు రావడం ఆనందదాయకమన్నారు. ఎలక్ట్రికల్ వాహనాలు (త్రీవీలర్) కొనుగోలుదారులకు పీఎంఈ డ్రైవ్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం రూ.20వేలు వరకు సబ్సిడీ ఇస్తున్నట్లు చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలు నానాటికీ పెరిగిపోతున్న తరుణంలో ఎక్కువమంది వాహనదారులు ఎలక్ట్రికల్ వాహనాలవైపు మొగ్గుచూపుతున్నారన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రికల్ వాహనాల వినియోగంతో వాయుకాలుష్యం, శబ్దకాలుష్యంకు చెక్ పెట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేనేజరు ఎండీ అబ్దుల్ మాలిక్, సీఎంఎం రామలక్ష్మి, ఏఈ సంజయ్, సీవోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇసుక లారీ తనిఖీ

● డ్రైవర్‌కు వార్నింగ్ ఇచ్చిన ఆర్డీవో కృష్ణనాయక్


ఇసుక లారీ డ్రైవర్‌కు వార్నింగ్ ఇస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

రాజమహేంద్రవరం సిటీ, మే 30 (ఆంధ్రజ్యోతి):రాజమహేంద్రవరంలాలాచెరువు సెంటర్‌లో అటుగా ఇసుకలోడుతో వెళుతున్న లారీని ఆర్డీవో కృష్ణనాయక్ నిలుపుదలచేసి డ్రైవర్‌కు వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం ఆర్‌డీవో తన వాహనంలో లాలాచెరువు వైపు వెళుతున్న సమయంలో ఇసుక లోడుతో వెళుతున్న లారీ వెనుక గ్రీన్ మ్యాట్ కట్టుకోకుండా వెళ్లడాన్ని గమనించిన ఆర్డీవో ఆ లారీని నిలుపుదల చేశారు. ఈ లారీ బిల్ చెక్ చేశారు. అటుపై ఇసుక లోడుతో వెళుతున్న లారీ వెనుక బాడిలో గ్రీన్ మ్యాట్ కట్టుకోకుండా ఉండటంపై డ్రైవర్‌ను మందలించారు. ఇసుక గాలిలో ఎగిరి వెనకాల వచ్చేవారి కళ్లలో పడుతుందని అప్పుడు ప్రమాదాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా ఇసుక రోడ్డుపై పడి రహదారులు పాడవుతున్నాయని ఆర్డీవో అన్నారు. గ్రీన్‌మ్యాట్‌లు వేసుకోకపోతే లారీ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆ లారీ డ్రైవర్‌తో గ్రీన్ మ్యాట్ కట్టించి హెచ్చరించి వదిలిపెట్టారు.

అసంఘటిత కార్మికుల హక్కులకోసం పోరాడుదాం

●సీఐటీయూ జిల్లా కార్యదర్శి పూర్ణిమారాజు


మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి పూర్ణిమారాజు

దివాన్‌చెరువు, మే 30 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులను సంఘటిత పరచి వారిహక్కుల కోసం సీఐటీయూ పనిచేస్తుందని జిల్లాకార్యదర్శి బి.వి.ఎన్.పూర్ణిమారాజు అన్నారు. దివాన్‌చెరువు పంచాయతీ వర్కర్స్ సీఐటీయూ అనుబంధం అయిన దివాన్‌చెరువు పంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జెండాను యూనియన్ అధ్యక్షుడు అక్కిరెడ్డి గణపతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో పూర్ణిమారాజు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు బకాయిపడ్డ రెండునెలల వేతనాలు మే నెల జీతంతో కలిపి జూన్ 6వ తేదీలోగా చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులు గత 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నా వీరికి ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. కనీస వేతనాలు కల్పించాలని, కార్మికచట్టాలు అమలుచేయాలని, అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు, వర్షాకాలంలో రైన్ కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు తాళ్ళపూడి మంగ, వేమగిరి సతీష్, నీలాపు గౌరి, మందపల్లి విజయ్, గాలంకి లాజర్, వసంతాలు పాల్గొన్నారు.

జాన్ వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

●750 మందికి వైద్యపరీక్షలు

రాజమహేంద్రవరంరూరల్, మే 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కోలమూరు గ్రామంలో జాన్‌వెస్లీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శుక్రవారం కోలమూరులో జాన్‌వెస్లీ ఫౌండేషన్ 200వ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరంలో దంతవైద్యులు, ఎముకల వైద్యులు, ఈఎన్‌టీ, ఫిజియో థెరపీ, జనరల్ వైద్యులు ప్రజలకు వైద్యపరీక్షలు చేశారు. ఈసీజీ, షుగరు, బీపీ, సీజనల్ వైద్యులైన డెంగ్యూ, మలేరియా, కామెర్లు వ్యాధులకు రక్త పరీక్షలు చేశారు. ఈ శిబిరంలో 750 మందికి వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు ప్రదీప్తిశాంతి, ఏంజెల్, డి. అన్ని, పూర్ణిమ, అంజలి వైద్యపరీక్షలు చేశారు. ఈ శిబిరంలో క్యాంప్ కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్ తగిన ఏర్పాట్లు చేశారు. స్థానిక ప్రజలు జాన్‌వెస్లీ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.


కోలమూరు లో ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

15వ రోజుకు మున్సిపల్ వర్కర్ల సమ్మె

రాజమహేంద్రవరం సిటీ, మే 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న సమ్మె శుక్రవారం 15వ రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం బయట నిరసన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమాదుల ఏసుబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి బుంగ యేసయ్యారాజు, నగర అధ్యక్షుడు సిరికి ప్రసాద్, సెక్రటరీ బాల భవానికుమార్, ఉపాధ్యక్షుడు ఎం.సాయి, గౌరవ అధ్యక్షుడు కె.ముకుందరావులు పాల్గొని మాట్లాడారు. మునిసిపల్ ఇంజినీరింగ్ ఔట్ సోర్సింగ్ వర్కర్లుకు, టెక్నికల్, నాన్ టెక్నికల్ వర్కర్లకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేస్తున్నామన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

రాజమహేంద్రవరంసిటీ, మే 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం హరిపురానికి చెందిన గోటేటి నాగ విజయలక్ష్మి(77) అనే వృద్ధురాలు కనిపించడంలేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే హరిపురానికి చెందిన గొట్టేటి పాహిశేషానంద్ అనే వృద్ధుడు తన భార్య నాగవిజయలక్ష్మి కొద్దిరోజుల నుంచి కనిపించడంలేదని ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదని శుక్రవారం త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'అహల్యాబాయి హోల్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి'


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ లక్ష్మీప్రసన్న

గోకవరం, మే 30(ఆంధ్రజ్యోతి): మహిళలు ఏ రంగంలోనూ తీసుపోరని నిరూపించిన వీర వనిత రాణీ పుణ్య శ్లోక అహల్యాబాయి హోల్కర్ అని, ఆమెను ప్రతీ మహిళా స్ఫూర్తిగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా జనరల్ సెక్రటరీ ఎస్.లక్ష్మీప్రసన్న అన్నారు. స్థానిక సత్యకృష్ణ ఫంక్షన్ హాల్లో విశ్వహిందూ ధర్మపరి రక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అహల్యాబాయి హల్కోర్ 300వ జయంతి వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ రాణి పుణ్య శ్లోక అహల్యాబాయి హోల్కర్ కార్యక్రమాలు ఏడాదిపాటు జరపడానికి బీజేపీతోపాటు, అనుబంధ సంస్థలకు పిలుపునిచ్చా మన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి 31 వరకు అహల్యాబాయి హోల్కర్ జయింతి కార్యక్రమాలను ప్రతీ బీజేపీ నాయకుడు, కార్యకర్త నిర్వహించాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందన్నారు2 రామసేన అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ 1966వ సంవత్సరంలో అహల్యాబాయి హోల్కర్ రాజ్యాధికారం చేపట్టి కాశీ నుంచి కన్యాకుమారి వరకు సుమారు 40వేల హిందూ ఆలయాల పునర్నిర్మాణానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, ఉంగరాల ఆదివిష్ణు, దాసరి ధర్మరాజు, బత్తుల నానాజీ, ఉంగరాల మణిరత్నం, ఐ.బి. దొర పాల్గొన్నారు.

దివాన్‌చెరువుకు ఫుల్‌టైమ్ కార్యదర్శిని నియమించాలి

దివాన్‌చెరువు, మే 30(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం దివాన్‌చెరువు పంచాయతీకి ఫుల్‌టైమ్ కార్యదర్శిని నియమించాలని, పారిశుధ్యకార్మికులకు బకాయిపడ్డ మూడునెలల జీతాలు వెంటనే చెల్లించేలా చూడాలని సామాజిక కార్యకర్త సూరారపు డేవిడ్‌రాజు కోరారు. రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించానని శుక్రవారం ఆయన తెలిపారు. ఏరచెరువును సుందరీకరించి అభివృద్ధి చేయవలసిన అవసరాన్ని వివరించానని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికిగాను ఆయన సానుకూలంగా స్పందించారని డేవిడ్‌రాజు తెలిపారు.

సామర్లకోట కెనాల్‌లో సైడ్ చానల్ గేట్లకు మరమ్మతు

● ఆనందం వ్యక్తం చేస్తున్నరైతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


చానల్ గేటుకు వెల్డింగ్ చేస్తున్న దృశ్యం


అనపర్తి, మే 30 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్లలో సాగునీటి కాలువలను పట్టించుకోకపోవడంతో సాగునీటి వ్యవస్థ పూర్తిస్థాయిలో నిర్వీర్య మై రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. అనేకచోట్ల చానల్స్ గేట్లకు కనీస మరమ్మతుల పరిస్థితి ఎలా ఉన్నా గ్రీజుపెట్టే పరిస్థితి లేక అవి మొరాయించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన జాగునికీకరణ కథనంపై అధికారులు, నీటి సంఘాల ప్రతినిధులు స్పందించారు. అనపర్తిలోని సామర్లకోట కాలువలో నెం.2, 3 చానల్స్‌లో అనేకచోట్ల సైడ్ వాల్స్ గేట్లు దెబ్బతిని సాగునీటికి ఇబ్బంది కలుగుతుందని ప్రచురించిన నేపథ్యంలో శుక్రవారం చానల్స్ మరమ్మతుల పనులకు శ్రీకారం చుట్టారు. మొత్తం ఐదు గేట్లకు మరమ్మతులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా సైడ్ చానల్స్‌కు అనుబంధంగా ఉన్న రియార్ సైడ్‌వాల్స్ ధ్వంసమై సాగునీటికి ఇబ్బంది కలగడంతో వాటి నిర్మాణాలు తక్షణమే చేయలేని పరిస్థితి ఉండటంతో వాల్స్‌స్థానే ఇసుకబస్తాలు ఏర్పాటు చేయడమే కాకుండా చానల్స్ ద్వారా నీరు సక్రమంగా పొలాలకు చేరే విధంగా పూడికతీత పనులను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనులను గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ తమలంపూడి సుధాకరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు తెరిచేలోపున వీలైనంత మేర పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు.

2న విజయవాడలో ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా జవహర్ బాధ్యతల స్వీకరణ

● దళిత నాయకుడు ఏసురత్నం


ప్రమాణ స్వీకార మహోత్సవ ఆహ్వానపత్రం ఆవిష్కరిస్తున్న దళిత నాయకుడు దారా ఏసురత్నం

రాజమహేంద్రవరం సిటీ, మే30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కె.ఎస్.జవహర్ జూన్ 2న విజయవాడలో పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్నారని దళిత గిరిజన నేతలు దారా ఏసురత్నం తెలిపారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరం దేవీ చౌక్‌లోని రత్నం ఆర్గనైజేషన్ కార్యాలయంలో యేసురత్నం ఆధ్వర్యంలో ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవీ బాధ్యతల స్వీకరణ ఆహ్వానపత్రం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ 2న ఉదయం 10:30కు విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ వద్ద ఉన్న ఎస్సీ కమిషన్ కార్యాలయంలో కేఎస్ జవహర్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని చెప్పారు. జవహర్‌ను ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా నియమించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు దళిత గిరిజనుల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో దళితగిరిజన నాయకులు తాళ్ళూరి బాబూరాజేంద్రప్రసాద్, కోరుకొండ చిరంజీవి, నీలాపు వెంకటేశ్వరరావు, కోరుమిల్లి విజయశేఖర్, చాపల చినరాజు, ముప్పిడి రాజు, ఎర్రంశెట్టి రాజ్‌కుమార్, సిద్దా గిరి తదితరులు పాల్గొన్నారు.




నేడే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

2,32,916 మందికి రూ.101. 73 కోట్లు

రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం ఉదయం 6.30 గంటల నుంచి లబ్ధిదార్ల ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ చేయనున్నట్టు ఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తెలిపారు. జూన్ 1న ఆదివారం అయినందున ప్రభుత్వం నిర్ణయం మేరకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లాలో ముందుగా పంపిణీకి ఏర్పాటు చేయించారన్నారు. మొత్తం జిల్లాలో 2,32,916 మందికి రూ.101 కోట్ల 73 లక్షల 77 వేల 500 పంపిణీ చేయవలసి ఉంది. ఈ సొమ్మును బ్యాంక్‌ల నుంచి శుక్రవారమే డ్రా చేసినట్టు ఆయన చెప్పారు.

చంద్రబాబు నేడు కోనసీమకు





చెయ్యేరులో ఏర్పాటైన ప్రజావేదిక

- ముఖ్యమంత్రి పర్యటనకు సర్వం సిద్ధం
- సీఎం పాల్గొనే రెండు సభా వేదికలను సిద్ధంచేసిన అధికారులు
- సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్.. పరిశీలించిన డీఐజీ అశోక్‌కుమార్
- 700 మందితో పోలీసు పటిష్ట బందోబస్తు
- ఆరు గంటల పర్యటనకు ఏర్పాట్లు పూర్తి



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు దాట్ల, రాజప్ప, పెందుర్తి

అమలాపురం/ముమ్మిడివరం, మే 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జరపనున్న పర్యటనకు అధికార యంత్రాంగం విస్తృత స్థాయిలో భారీ ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమైంది. హెలిప్యాడ్‌తోపాటు రహదారులు అభివృద్ధి, సీఎం పాల్గొనే రెండు ప్రాంతాల్లో బహిరంగ సభలకు భారీ వేదికలు సిద్ధమయ్యాయి. ఉపాధి హామీ పథకం ద్వారా చెరువు పూడికతీత పనులకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. ఆరు గంటలపాటు రెండు గ్రామాల్లో జరిగే సీఎం పర్యటనకు అనూహ్యమైన రీతిలో భద్రతా చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రం సీఎం కాన్వాయ్‌తో అధికారులు ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ బి.కృష్ణారావు, అడిషనల్ ఎస్పీ ప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, ఎమ్మెల్యే దాట్ల బుచ్చిరాజు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 700 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టడంతోపాటు సభావేదికల వద్ద భారీ సామర్థ్యం కలిగిన జనరేటర్లను ఏర్పాటుచేశారు. ఎండతీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కూలర్లు, ఏసీలు ఏర్పాటుచేశారు. తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు వంటివి ప్రజల కోసం సిద్ధం చేస్తున్నారు. అతిథుల కోసం ప్రత్యేక భోజన ఏర్పాట్లు సిద్ధం చేశారు. కాగా సీఎం చంద్రబాబు శనివారం నాటి పర్యటనకు సంబంధించి కాన్వాయ్ ట్రయల్ రన్‌ను అధికారులు పకగ్బందీగా నిర్వహించారు. హెలిప్యాడ్ నుంచి ట్రయల్ రన్ ప్రారంభమై సత్తెమ్మతల్లి గుడి మీదుగా చెయ్యేరు గున్నేపల్లి, చెయ్యేరు వరకు నిర్వహించారు. సీఎం పాల్గొనే కార్యక్రమాల వద్ద కూడా ట్రయల్ రన్ నిర్వహించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, మంత్రి సుభాష్, సీఎం పర్యటన కమిటీ సారధి పెందుర్తి వెంకటేష్, పలువురు నేతలు ట్రయల్ రన్‌లో పాల్గొన్నారు. తర్వాత కొన్ని సూచనలు చేసి, వాటిని సరిదిద్దాలని అధికారులను ప్రజాప్రతినిధులు కోరారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా..

సీఎం చంద్రబాబు పర్యటనలో స్వల్పమార్పులు జరిగాయి. ఆ ప్రకారం.. శనివారం ఉదయం 11 గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరతారు. 11.45 గంటలకు కోనసీమ జిల్లాలోని ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ 11.45 గంటల నుంచి 12.10 గంటల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులతో పరస్పర సంభాషణలు ఉంటాయి. 12.10 గంటలకు బయలుదేరి కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామానికి రోడ్డు మార్గాన బయలుదేరతారు. 12.15 గంటల నుంచి 45 నిమిషాలపాటు పేదల సేవలో కార్యక్రమం బంగారు కుటుంబం(పీ4)లో భాగంగా గ్రామస్తులు కొందరిని దాతలు దత్తత తీసుకుంటారు. అలాగే ఉపాధి పథకం కింద చేపట్టే చెరువు పూడికతీత పనుల పరిశీలన, కార్మికులతో సమావేశం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి బయలుదేరి చెయ్యేరులో ప్రజావేదిక జరిగే ప్రాంతానికి చేరుకుంటారు. 1.05 గంటల నుంచి 2 గంటల వరకు సమయాన్ని రిజర్వు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు స్థానిక ప్రజలతో ప్రజావేదికలో ముఖాముఖి సమావేశమవుతారు. 3.30 గంటలకు ప్రజావేదిక నుంచి బయలుదేరి సీహెచ్ గున్నేపల్లి వద్దనున్న టీడీపీ కేడర్ సమావేశ వేదికకు చేరుకుంటారు. 3.35 గంటల నుంచి 5.05 గంటల వరకు కేడర్ సమావేశంలో పాల్గొంటారు. అక్కడి నుంచి బయలుదేరి 5.10 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 5.15 గంటలకు హెలిప్యాడ్‌కు నుంచి బయలుదేరి ఆరు గంటలకు తాడేపల్లి మండలం ఉండవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసానికి చేరుకుంటారు.




పోలవరం ఎడమ కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

పోలవరం ఎల్‌ఎంసీ పనులు వేగవంతం!

- జూన్ ఆఖరుకి విశాఖకు నీరందించాలనే లక్ష్యంతో పనులు
- ఎనిమిది ప్యాకేజీలతో ఊపందుకున్న పనులు
- కోరుకొండ మండలం నుంచి విశాఖ వరకూ పనులు మొదలు
- జూన్ 30లోపు పూర్తిచేసే లక్ష్యం.. ఎల్‌ఎంసీ ఎస్‌ఈ ఏసుబాబు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులు వేగవంతం అయ్యాయి. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన కాలువలు రెండు ఉన్న సంగతి తెలిసిందే. ఒకట కుడి ప్రధాన కాలువ(ఆర్‌ఎంసీ). ఇది పోలవరం నుంచి కృష్ణా జిల్లా వరకూ వెళుతుంది. ఇది ఇంచుమించు పూర్తయిన సంగతి తెలిసిందే. రెండోది ఎడమ ప్రధాన కాలువ(ఎల్‌ఎంసీ). ఇది ప్రాజెక్టు దగ్గర నుంచి విశాఖ వరకూ నీటిని తీసుకుని వెళ్లే లక్ష్యంతో నిర్మిస్తున్నారు. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం పట్టిసీమను నిర్మించి ఆర్‌ఎంసీ ద్వారా కృష్ణా నదికి గోదావరి నీటిని మళ్లించిన సంగతి తెలిసిందే. అదేవిధంగా పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నిర్మించి ఏలేరు రిజర్వాయర్‌కు నీటిని పంపించి, అక్కడ నుంచి విశాఖకు మంచినీటిని పంపించే ప్రయత్నం చేశారు. కానీ 2019లో ప్రభుత్వం మారడంతో అప్పట్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మొత్తం పోలవరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసిన సంగతి తెలిసిందే. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకాన్ని కూడా పనిచేయకుండా చేసేశారు. దీంతో చాలా బ్రిడ్జిలు, సూపర్ పాసేజ్‌ల వంటి పనులు మధ్యలో ఆగిపోయాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించడంతో తిరిగి పోలవరం ప్రాజెక్టు డయాఫ్రంవాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ వంటి పనులు చేస్తూ, వాటికంటే ముందు ఎడమ ప్రధాన కాలువ పనులు కూడా పూర్తిచేసి, విశాఖకు నీరందించాలనే లక్ష్యంతో జనవరిలో పనులు మొదలుపెట్టారు. మొత్తం పోలవరం ప్రాజెక్టు దగ్గర నుంచి 214.808 కిలోమీటర్ల మేర ఈ ఎడమ ప్రధాన కాలువను నిర్మించవలసి ఉంది. ఇది పూర్తి చేసి విశాఖ ఇండస్ట్రియల్ అవసరాలకు నీరందివ్వడంతోపాటు దారిలోని గ్రామాల మంచినీటి అవసరాలు కూడా తీర్చాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు అధికార్లకు లక్ష్యాలను నిర్దేశించారు. జూన్ నెలాఖరుకి ఇది పూర్తి చేయాలనే తపనతో పనులు జరుగుతున్నాయి. మొత్తం రూ.3063.88 కోట్లతో గతంలో ఈ పనులు మొదలుపెట్టగా రూ.18.12.956 పనులు పూర్తిచేశారు. మిగతా పనిని 8 ప్యాకేజీలుగా విభజించి పనులు మొదలుపెట్టారు. ప్యాకేజీ -1 పరిధిలోకి 25 కిలోమీటర్ల మేర కాలువ ఉంది. సీతానగరం మండలం శివారు నుంచి కోరుకొండ మండలం పరిధివరకూ ఉంది. ఇక్కడ ఎర్త్ వర్కు జరుగుతోంది. జూన్ నెలాఖరికి ఇది పూర్తి చేస్తామని అక్కడి అధికారులు చెబుతున్నారు. ప్యాకేజీ -2 ఇప్పటికే పూర్తయింది. ప్యాకేజీ-3 పరిధిలో ఏలేరు రిజర్వాయర్‌లో పైఫన్ నిర్మిస్తున్నారు. వర్షాల వల్ల పనులకు కాస్త ఇబ్బంది కలిగినా రాత్రి పగలూ పనిచేస్తున్నారు. ఇది కృష్ణవరం సమీపంలో జరుగుతోంది. 4వ ప్యాకేజీ కింద పంపానది పరిధిలో పనులు జరుగుతున్నాయి. అక్కడ అక్విడక్ట్ నిర్మిస్తున్నారు. పైల్స్ నిర్మాణం మొదలు పెడుతున్నారు. కానీ ఇక్కడ పంపానదిలో 83 అడుగుల కంటే తక్కువ నీరు ఉంటే పనులు వేగవంతంగా జరుగుతాయని, ఇటీవల నీటిమట్టం 86.5 అడుగులకు పెరిగిందని, దీనితో ఇక్కడ పనుల కోసం ప్రత్యామ్నాయ మార్గాలు కూడా అన్వేషిస్తున్నారు. ముందు ఎర్త్‌వర్కు పూర్తి చేస్తున్నారు. 5వ ప్యాకేజీ కింద కుమ్మరలోవ ప్రాంతం ఉంది. ఇక్కడ ఒక కాలనీని ఇప్పుడే ఖాళీ చేయిస్తున్నారు. ఈలోపు ఈ ప్రాంతంలో రెండు పెద్ద కొండల మధ్య నుంచి కాలువ వెళ్లడం వల్ల ఆ కొండలు పగలగొడుతున్నారు. 6వ ప్యాకేజీ అనకాపల్లి జిల్లా పరిధిలోని పాయకరావు పేట నియోజకవర్గం పరిధిలో ఉంది. ఇక్కడ కూడా కొన్ని సమస్యలు ఉండగా, ఇటీవలే పరిష్కారమయ్యాయి. 78 మీటర్ల నుంచి 90 మీటర్ల ఎత్తువరకూ ఇక్కడ కొండలు ఉన్నాయి. వాటిని తొలగిస్తున్నారు. ఈ కొండల సమీపంలో షుగర్ ఫ్యాక్టరీ, దుర్గాకాలనీ ఉండడతో అక్కడ సమస్య పరిష్కారం కోసం కొంత సమయం పట్టింది. 7వ ప్యాకేజీ కింద అనకాపల్లిలో దార్లపూడి ప్రాంతం ఉంది. ఇక్కడ అక్విడక్టు నిర్మిస్తున్నారు. 8వ ప్యాకేజీ విశాఖ పరిధిలో ఉంది. 30 మీటర్ల నుంచి 40 మీటర్ల లోతు వరకూ నీరుండడంతో ఇక్కడ డీసిల్టేషన్ కోసం డ్రెడ్జిం గ్ చేస్తున్నారు. కాగా పోలవరం ఎడమ కాలువ పనులను జూన్ నెలాఖరుకి పూర్తిచేసి విశాఖకు నీరందించే లక్ష్యంతో పనులు వేగవంతం చేశామని పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎస్‌ఈ బి ఏసుబాబు తెలిపారు.



'సుఖీభవ' అనరే..



- ఉమ్మడి తూ.గో. జిల్లాలో అన్నదాత సుఖీభవకు రీసర్వే గండం
- గత వైసీపీ ప్రభుత్వంలో తప్పిదాలు అన్నదాతలకు శాపంగా మారిన వైనం
- సర్వే నెంబర్ల స్థానంలో తెచ్చిన ఎల్‌పీఎం నెంబర్ల విధానంలో అడ్డగోలు తప్పులు
- ఒక్కో ఎల్‌పీఎంల్లో పదులకొద్దీ రైతుల విస్తీర్ణాలు ఉంచేసి రీసర్వే
- ఉమ్మడి జిల్లాలో 69,327 మంది పథకానికి దూరమయ్యే ప్రమాదం
- ఇప్పటివరకు 8,82,286 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ పరిశీలన పూర్తి
- మరోపక్క అర్హుల జాబితా ఖరారుకు వ్యవసాయశాఖ దాదాపుగా కసరత్తు పూర్తి
- ఈలోపు రెవెన్యూశాఖ తప్పులు సరిదిద్దకపోతే వేలల్లో నష్టపోనున్న రైతులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి రీసర్వే తప్పులు తల నొప్పులుగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వం చేసిన అడ్డగోలు వ్యవహారంతో వేలాది మంది అన్నదాతలు ఇప్పుడు పథకానికి దూరమయ్యే ప్రమాదం నెలకొంది. పూర్వపు సర్వే నెంబర్ల స్థానంలో కొత్తగా ఎల్‌పీఎం నెంబర్లు కేటాయించే క్రమంలో అనేక తప్పులు దొర్లడంతో రైతులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. ఒక రైతుకు ఒక ఎల్‌పీఎంకు బదులు ఒకే నెంబర్ పదుల కొద్దీ రైతులకు ఇచ్చేసి రీసర్వే పాపాలు చేయడంతో వారి పేర్లు సర్వర్లకు ఎక్కడం లేదు. ఈ తప్పులను సరిచేయాలని వ్యవసాయశాఖ అధికారులు రెవెన్యూశాఖకు వివరాలు పంపినా కనీసం ఖాతరు చేయకుండా వాటిని పక్కన పడేసింది. మరోవైపు జిల్లాస్థాయిలో అర్హుల జాబితాలను తయారు చేసి వాటిని ప్రభుత్వానికి పంపడంలో వ్యవసాయశాఖ అధికారులు నిమగ్నమైంది. ఈలోపైనా సమస్య పరిష్కారం చేయాలని రైతులు కోరుతున్నారు.

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

అన్నదాత సుఖీభవ పథకం జూన్‌లో అమలు చేస్తున్నట్టు సీఎం చంద్రబాబు ప్రకటించిన విషయం తెలిసిందే. కేంద్రం ఇచ్చే డబ్బులతో కలిసి రైతు కుటుంబం యూనిట్‌గా ఏడాదికి రూ.20వేల చొప్పున ఈ పథకం ద్వారా బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేస్తామని సీఎం ఈ సందర్భంగా స్పష్టంచేశారు. అంటే పీఎం కిసాన్ కింద కేంద్రం ఇచ్చే రూ.6వేలు, మిగిలిన రూ.14 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున పథకం కింద డబ్బులు జమచేయనున్నారు. అందులోభాగంగా పథకం అమలుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కసరత్తు మొదలుపెట్టింది. అందులోభాగంగా జిల్లాల వారీగా లబ్ధిదారుల జాబితాలను తయారు చేయాలని జిల్లాల వ్యవసాయశాఖలను ఆదేశించింది. ఈనేపథ్యంలో తమ వద్దనున్న వెబ్‌ల్యాండ్ వివరాల ఆధారంగా జిల్లాల వారీగా రైతుల వివరాల నివేదికను అధికారులు సిద్ధం చేశారు. వీటిని రైతు సేవా కేంద్రాలు, సచివాలయాల్లోని వీఏఏలకు, మండల వ్యవసాయాధికారులకు పరిశీలన కోసం ఇటీవల పంపారు. వెబ్‌ల్యాండ్ వివరాలను సరిచూసి తుది జాబితా రూపొందించాలని ఆదేశించారు. ఈ క్రమంలో కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలో వ్యవసాయాధికారులు, సిబ్బంది ప్రస్తుతం జాబితా తయారీలో నిమగ్నమయ్యారు. మరో రెండు రోజుల్లో అర్హుల జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాల్సి ఉంది. అయితే వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా లబ్ధిదారుల జాబితా తయారీలో ఇప్పుడు వ్యవసాయశాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. వేలాదిమంది రైతులకు సంబంధించి వివరాలు గందరగోళంగా ఉండడంతో వాటిని నమోదు చేయడానికి నిబంధనలు అంగీకరించక ఏంచేయాలో తెలియక వారిని పక్కన పెడుతున్నారు. దీనికంతటికి గత వైసీపీ ప్రభుత్వంలో చోటుచేసుకున్న రీసర్వే తప్పులే కారణం. అప్పట్లో రీసర్వే పేరుతో ప్రభుత్వం ఎప్పటి నుంచో ఉన్న సర్వే నెంబర్ల స్థానంలో ఎల్‌పీఎం(ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబర్ల వ్యవస్థ తీసుకువచ్చింది. ఈవిధానంలో రీసర్వే అనంతరం ఒక రైతుకు ఒక ఎల్‌పీఎం నెంబరు కేటాయించాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయిలో రీసర్వే అడ్డదిడ్డంగా జరగడంతో ఎల్‌పీఎం నెంబర్లు ఒక రైతుకు బదులు అదే నెంబరు పది మందికిపైగా రైతులకు అడ్డదిడ్డంగా కేటాయించేశారు. ఇలా వేలాదిమంది రైతులకు ఒకే నెంబరు ఇచ్చేశారు. అయితే ఇప్పుడు ఈ డేటాను ఆన్‌లైన్ చేయడంలో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే ఈ తప్పులతో అనేకమంది రైతులు పంట రుణాలు పొందేందుకు, అకాల వర్షాలు, వరదలప్పుడు వచ్చే పంట నష్టపరిహారం తీసుకునేందుకు వీలుకాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటు ఉమ్మడి ఎల్‌పీఎం ఉన్న రైతులకు సైతం ఈ లబ్ధి అందకుండా పోయింది. అప్పటి నుంచి ఉమ్మడి ఎల్‌పీఎంలను విడదీసి ప్రత్యేక నెంబర్లు కేటాయిస్తామని ప్రభుత్వం ప్రకటించినా క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియ పెద్దగా జరగడం లేదు. దీంతో వీరంతా ఇప్పుడు సుఖీభవ పథకం అమలుకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. అలాగే ఆధార్ అనుసంధానంలో తప్పులు, మరణించిన వారి పేరుపై భూమి ఉన్నట్టు చూపించడం, సర్వే నెంబర్లల్లో తేడాలు సైతం చాలా ఇబ్బందికరంగా మారాయి.

సరిచేయకుంటే ఇబ్బందులే..

వాస్తవానికి అన్నదాత సుఖీభవ ద్వారా లబ్ధి పొందేందుకు రైతులకు సంబంధించిన అన్ని వివరాలు సక్రమంగా ఉండాలి. ఉమ్మడి ఎల్‌పీఎం ఉంటే అందులో ఉండే రైతులకు లబ్ధి అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఒకే నెంబరు ఇద్దరు, ముగ్గురు రైతులకు వేసేందుకు ఆన్‌లైన్‌లో అవకాశం లేదు. దీంతో ఉమ్మడి ఎల్‌పీఎం నెంబర్లతోపాటు ఇతర రెవెన్యూపరమైన అంశాలను సరిచేసేందుకు వ్యవసాయశాఖ రెవెన్యూ అధికారులకు జాబితా పంపింది. ఎల్‌పీఎం సమస్యలు, సర్వేనెంబర్ల తేడాలు సరిచేయాలని కొంతకాలం కిందట పంపించింది. కానీ ఇప్పటివరకు రెవెన్యూ అధికారులు దీనిపై అసలు దృష్టిసారించలేదు. దీంతో పథకం అమలుకు గడువు దగ్గరపడ్డా సమస్య పరిష్కారం అయ్యేలా కనిపించడం లేదు. వాస్తవానికి కాకినాడ జిల్లాలో ఇంతవరకు 2,63,416 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేశారు. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 17,021 మంది రైతుల వివరాలను సరిచేసి పంపించాలని తహశీల్దార్లను వ్యవసాయశాఖ అధికారులు కోరారు. కానీ ఇందులో ఇప్పటివరకు 1,169 మాత్రమే పరిష్కరించారు. అదేవిధంగా తూర్పుగోదావరి జిల్లాలో 2,52,002 మంది రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, 2,17,007 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. రీసర్వే, రెవెన్యూ సంబంధిత సమస్యలున్న 11,932 మంది రైతుల వివరాలను సరిచేయాలని రెవెన్యూశాఖకు పంపారు. ఇందులో ఇంతవరకు 2,141మాత్రమే పరిష్కారమయ్యాయి. అలాగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటివరకు 3,67,049 మంది రైతుల వివరాలకుగాను 3,66,868 మందివి మాత్రమే పరిశీలన పూర్తయ్యాయి. ఇంకా 40,374 మంది రైతుల సమస్యలను రెవెన్యూ అధికారులు పరిష్కరించాల్సి ఉండగా, అందులో 2,011 మాత్రమే పరిష్కారమయ్యాయి. ఇలా సరిచేసిన రైతులకు మాత్రమే అన్నదాత సుఖీభవ అందే అవకాశం ఉంది. లేదంటే అభ్యంతరాలు పెండింగ్‌లో ఉన్న అన్నదాతలకు ప్రయోజనం దక్కే అవకాశం ఉండదు.



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాత సుఖీభవ వివరాలు ఇలా...

	కాకినాడ జిల్లా	తూర్పుగోదారి జిల్లా	కోనసీమ జిల్లా
ఆన్‌లైన్‌లో నమోదైన రైతులు	2,63,416	2,52,002	3,67,049
పరిశీలన పూర్తయిన రైతులు	2,63,416	2,17,007	3,66,868
తహశీల్దార్లకు పంపిన సమస్యలు	17,021	11,932	40,374
వీటిలో పరిష్కరించినవి	1169	2141	2011
ఇంకా పెండింగ్‌లో ఉన్నవి	15,852	9791	38,363

కసరత్తు మొదలు..

అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు వీలుగా రెవిన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు. లేదంటే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 69,327 మంది రైతులు పథకానికి దూరం కానున్నారు. వాస్తవానికి గత వైసీపీ హయాంలో వివిధసాకులతో రైతు భరోసా కింద లబ్ధిపొందే వారి సంఖ్యను అడ్డంగా కుదించేశారు. ఏటేటా వివిధ నిబంధనల పేరుతో లబ్ధిదారులను తగ్గించేశారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మాత్రం సుఖీభవ పథకానికి ఎలాంటి కోతలు లేకుండా వెబ్‌ల్యాండ్ ఆధారంగా కుటుంబం యూనిట్‌గా ప్రతి రైతుకి పథకం అందించేలా అధికారులను ఆదేశించింది. ఈనేపథ్యంలో రాష్ట్రస్థాయి నుంచి పంపిన వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా జాబితాను తయారు చేసి రెండు రోజుల్లో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు నుంచి ప్రభుత్వానికి జాబితా పంపనున్నారు. వీటిని రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరోసారి తనిఖీ చేయనుంది. ఆ తర్వాత లబ్ధిదారుల జాబితాలను మళ్లీ జిల్లాలకు పంనుంది. ఈ జాబితాలను రైతుసేవా కేంద్రాల ద్వారా ప్రదర్శించి త్వరలో అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆతర్వాత తుది జాబితా రూపొందించి పథకం డబ్బులను రైతుల ఖాతాలకు జమ చేస్తారు.

అరగుండు చేయించుకున్న జగన్ అభిమాని

తూర్పుగోదావరి జిల్లా ఊనగట్లలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి



అరగుండుతో వీరవల్లి శివ

చాగల్లు, మే 30(ఆంధ్రజ్యోతి): స్నేహితులకు ఇచ్చిన మాట ప్రకారం జగన్ ఓటమి చెందినందుకు ఆయన అభిమాని అరగుండు చేయించుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలంలో ఈనెల 25న ఈ ఘటన జరిగింది. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలివి. చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన వీరవల్లి శివ వైసీపీ కొవ్వూరు నియోజకవర్గం సోషల్ మీడియా కో కన్వీనర్‌గా వ్యవహరించేవాడు. ఎన్నికల సమయంలో వైసీపీ గెలుపు ఖాయమని చాలా ధీమా వ్యక్తం చేశాడు. జగన్ ఓడిపోతే అరగుండు చేయించుకుంటానని పందెం కాశాడు. దీంతో జగన్ ఓటమి చెంది సంవత్సరం పూర్తవుతున్న సందర్భంగా ఈనెల 25న ఆదివారం సాయంత్రం అతడు అరగుండు చేయించుకుని ఊనగట్ల సెంటర్‌లో కొద్దిసేపు తిరిగాడు. కాగా ఈ విషయం బయటకు పొక్కలేదు. శుక్రవారం ఈ విషయం వెలుగుచూడడంతో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రిగా జగన్ అమలు చేసిన పథకాలు ఆయనను గెలిపిస్తాయని నమ్మానని, కానీ ప్రజలు వైసీపీని తిరస్కరించారని, జగన్ ఓడిపోవడంతో స్నేహితులకు ఇచ్చిన మాట కోసం అరగుండు చేయించుకున్నానని వీరవల్లి శివ ఈ సందర్భంగా బదులిచ్చాడు.

జిల్లాలో ఎంటర్‌ప్రైజెస్‌పై సర్వే

- ఇప్పటివరకూ 92,336 సంస్థల గుర్తింపు
- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



రాజమహేంద్రవరం, మే 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎంటర్‌ప్రైజెస్ ఎంతమంది ఉన్నారనే వివరాల సేకరణకు సర్వే చేస్తున్నారు. ఇప్పటివరకూ 92,336 ఉన్నట్టు గుర్తించినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం సాయంకాలం పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల ఆధారంగా 92,980 ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయని, వాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా ఎన్ని ఉన్నాయనే అంశాలపై సర్వే చేస్తున్నట్టు చెప్పారు. జిల్లాలో రూ.2150 కోట్ల పెట్టుబడులతో 3,300 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి కల్పించే విధంగా వివిధ పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయన్నారు. క్లస్టర్ అభివృద్ధి పథకం ద్వారా క్లస్టర్లు త్వరగా ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో 37 పరిశ్రమలకు సంబంధించిన రూ.67,65,637 విలువైన రాయితీలకు సంబంధించిన దరఖాస్తులు పరిశీలించి, వాటిని మంజూరు చేసినట్టు కలెక్టర్ చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, జిల్లా పరిశ్రమల అధికారి వాణిధర్ రామన్, డీఆర్వో టి. సీతారామమూర్తి, ఆర్డీవోలు ఆర్ కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపు డెల్టా కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం, మే 30 (ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి ఖరీఫ్ పంటకు సంబంధించి ఆదివారం నాడు డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. రబీ అనంతరం ఏప్రిల్ 27న తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలను మూసివేసి పంట కాలువల్లో తూడు తొలగింపు, పూడిక తీత, షెట్టర్‌లు, లాకుల రిపేర్లు వంటి క్లోజర్ పనులు చేపట్టి ఖరీఫ్‌లో రైతాంగానికి సాగునీరు అందించడానికి కాలువలను సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం నిర్ణయించిన ముహూర్తానికి పూజలు నిర్వహించి హెడ్ స్లూయిజ్ గేట్లను ఎత్తి కాల్వలకు నీటిని విడుదల చేయనున్నారు. కాగా ఆదివారం డెల్టా కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్టు సర్కిల్ ఎస్‌ఈ గోపీనాథ్ తెలిపారు.

సారా రహిత మండలంగా ఉండ్రాజవరం

గత రెండేళ్లుగా అక్కడ సారా కేసుల నమోదు లేదు

నిడదవోలు

ఎక్సైజ్ సీఐ వెల్లడి

6

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం


పట్టణంలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సీఐటీయూ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా బుద్ధుడి విగ్రహం వద్ద జిల్లా అధ్యక్షుడు ఎం. సుందర బాబు, బస్టాండ్ సెంటర్‌లో పట్టణ అధ్యక్షుడు మద్దుకూరి దొరయ్య జెండాలను ఎగుర వేశారు. సుందరబాబు మాట్లాడుతూ 1930 మే 30న కలకత్తాలో ఏర్పడిన నాటినుంచి ఇప్పటివరకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రైవేటీకరణ విధానాలతో పాటు కార్మికుల సమస్యలపై 21 దేశ వ్యాప్త సమ్మెలు, పోరాటాలు నిర్వహించిందన్నారు. మాణికిరెడ్డి హరిబాబు, ఉప్పె శ్రీను, మామిడి వీరబాబు, నందం కొండబాబు, కార్మికులు పాల్గొన్నారు.

'నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సాగుచేయాలి'


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రమణ, హాజరైన అధికారులు

నల్లజర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): జూన్ నుంచి ప్రారంభమయ్యే సార్వా సాగులో రైతులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో సాగు ప్రారంభించాలని వెంకట రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషీవిజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రకాశరావుపాలెం, ఆవపాడు, సింగరాజుపాలెం గ్రామాల్లో రైతులకు వరి, ఆయిల్‌పాం, కూరగాయల సాగు, కోకో, కొబ్బరి పంటల్లో వచ్చే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయిల్‌పాం పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కే. రామచంద్రుడు, డాక్టర్‌మేరీ మాట్లాడుతూ ఆయిల్‌పాంలో అంతర్ పంటగా కోకో వేస్తే రైతులకు అధిక లాభాలతో పాటు క్రిమికీటకాల బెడద తగ్గుతుందన్నారు. ప్రస్తుత కాలంలో కొబ్బరిపంటకు అధిక డిమాండ్ ఉందన్నారు. భవిష్యత్ తరాల్లో ఉద్యానపంటకే ప్రాముఖ్యత ఉంటుందన్నారు. కోకో గింజలకు ప్రభుత్వం కేజీ రూ.500 కేటాయించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయలక్ష్మి, భువనేశ్వరి, దీప్తి, దుర్గాప్రసాద్, ఉద్యాన శాఖ అధికారి బబిత, ఏవో కమల్‌రాజ్, త్రీఎఫ్ మేనేజర్ విజయప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ములు చెల్లించాలని నిరసన


తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉండ్రాజవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లులకు ధాన్యం పంపి రోజులు తరబడినా ఇంకా సొమ్ములు జమ కాలేదని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం రైతులు నిరసన ప్రదర్శన చేశారు. సొమ్ములు జమ కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్టు ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్తకు చెందిన రైతులు వాపోయారు. అనంతరం తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, పెన్నేటి బాలకృష్ణ, అక్కిన గోపాలకృష్ణ, కడలి శ్రీను, చెట్టే శ్రీనివాసు, ఈద్పుగంటి ప్రసాద్, రాఘవులు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిని కొట్టి గాయపర్చిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన షేక్ షాన్‌బాషా ఈనెల 28వ తేదీన సాయి చికెన్‌షాపు వద్ద ఉండగా సాయి, రాజేష్, చందు వచ్చి ఘర్షణ పడి దాడి చేశారు. కాలర్ పట్టుకుని కొట్టి గాయపర్చారు. గాయపడిన షాన్‌బాషాను చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు షాన్‌బాషా ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

మరో ఘటనలో ఒకరిపై...

వ్యక్తిని కొట్టి గాయపర్చడంతో కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ జీజీ ప్రకాష్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. పట్టణానికి చెందిన కొనకళ్ల అంజి ఈనెల 28న చికెన్ షాపు శివ ఇంటిలో శుభకార్యానికి వెళ్లాడు. భోజనాలు వడ్డించే సమయంలో షాన్‌బాషాకు, అంజికి మధ్య వివాదం నెలకొనడంతో అంజికి గాయాలయ్యాయి. కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు.

ఘనంగా గంగానమ్మ జాతర

నల్లజర్ల, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరంలో గంగానమ్మ జాతర మహోత్సవాలు రెండోరోజైన శుక్రవారమూ ఘనంగా జరిగాయి. రాత్రి బుల్లితెర ప్రముఖులు లలితా, చరణ్‌తో మ్యూజికల్ నైట్ నిర్వహించారు. గ్రామ పెద్దలు, జాతర కమిటీ సభ్యులు, తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు గస్తీని ఏర్పాటు చేశారు.

నేడు పట్టణంలో యోగాపై అవగాహన ర్యాలీ

మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్


సంస్కృత పాఠశాలలో యోగాసనాల్లో కమిషనర్ నాగేంద్రకుమార్, తహశీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు పట్టణంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం కొవ్వూరు ఆంధ్రగీర్వాణ విద్యాపీఠంలోని సంస్కృత కళాశాల ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనర్ నాగేంద్రకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొని యోగా సాధన చేశారు. మాస్టర్ ట్రైనీలు లీలం వెంకట శ్రీనివాసరావు, పెనుమత్స సరోజినరీ యోగాపై శిక్షణను అందించి, అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలోని ప్రజలకు యోగా ప్రాముఖ్యతను వివరించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. యోగాపై ఆసక్తి కలిగిన వారిని యోగాంధ్ర యాప్‌లో నమోదు చేయించాలన్నారు. దీనిలో భాగంగా శనివారం ఉదయం 10-30 గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి విజయవిహార్ సెంటర్ వరకు యోగాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారన్నారు.

కార్యక్రమంలో ఆయుష్ మెడికల్ ఆఫీసర్ కె. శ్రీవిద్య, ఎం. రాజసులోచన, ఎంఈవో రామకిషోర్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్‌వర్కర్లు, వార్డు సెక్రటరీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

'ఎస్సీలుగా గుర్తించాలి'


ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): బేడ, బుడగ జంగాలకు చెందినవారిని ఎస్సీలుగా గుర్తించాలని ఆ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కొవ్వూరులో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బేడ, బుడగ జంగాలకు చెందిన వారిని ఎస్సీలుగా గుర్తించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వీరవల్లి ఏసు, కప్పిరి వెంకన్న, శివరాత్రి సీమోన్, వీరవల్లి సరాబందు, కప్పిరి వెంకటేశులు, కుమారి రాముడు, మార్క్, చిన్న వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి


యర్నగూడెంలో లబ్ధిదారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న శివప్రసాద్

దేవరపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి, వచ్చేనెల 12వ తేదీ కల్లా గృహప్రవేశాలు అయ్యేవిధంగా చూడాలని అధికారులను గృహ నిర్మాణశాఖ ఎండీ ఎం.శివప్రసాద్ ఆదేశించారు. యర్నగూడెంలో శుక్రవారం సొంత స్థలాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్, గ్రామీణ ఇళ్ల మంజూరులో భాగంగా 50 ఇళ్లు పూర్తయ్యాయి. శివప్రసాద్ మాట్లాడుతూ ఇళ్లను త్వరితగతిన నిర్మించుకునేలా అధికారులు కృషిచేయాలని వివరించారు. గృహనిర్మాణశాఖ ఎస్ఈ జయరామాచారి, కొవ్వూరు డివిజన్ గృహనిర్మాణ శాఖ పీడీ ఎస్. భాస్కర్‌రెడ్డి, కొవ్వూరు డివిజన్ గృహ నిర్మాణశాఖ ఈఈ ఎస్. చంద్రశేఖర్, గోపాలపురం నియోజకవర్గ గృహనిర్మాణశాఖ డీఈ శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

అరాచకాలు సహించబోం : ఎమ్మెల్యే

గోపాలపురం, మే 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అరాచకాలను సహించబోమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. జగన్నాథపురంలో ఈనెల 23న నిర్వహించిన గ్రామదర్శిని కార్యక్రమంలో గ్రామస్థులు 22ఏలో ఉన్న తమ ఇళ్లకు సంబంధించి గ్రామకంఠం భూమిని తొలగించాలని ఎమ్మెల్యే ముందు ఏకరువుపెట్టారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెనువెంటనే జిల్లా కలెక్టర్ పీ.ప్రశాంతితో మాట్లాడి జగన్నాథపురంలో గ్రామకంఠంలో ఉన్న భూమిని 22ఏ నుంచి తొలగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో పాలకులు ప్రజలను నానా ఇబ్బందులు పెట్టారనటానికి ఇదే ఉదాహరణ అన్నారు. గ్రామానికి చెందిన తెలుగు యువత అధ్యక్షుడు కాట్రగడ్డ సురేశ్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పసుమర్తి గంగాధర్, చొరవతో 22ఏ గురించి తన దృష్టికి రావడంతో స్పందించిన వెనువెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడం జరిగిందన్నారు. తరువాత మూడు రోజుల్లోనే కలెక్టర్ ఈ సమస్యపై దృష్టిసారించారన్నారు. ఈసందర్భంగా గ్రామస్థులు మద్దిపాటికి కృతజ్ఞతలు తెలిపారు.

సారా రహిత మండలంగా ఉండ్రాజవరం

ఉండ్రాజవరం, మే 30 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం మండలాన్ని సారా రహిత మండలంగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించినట్టు నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్. జయరామ్‌సతీష్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్రాన్ని సారా రహిత రాష్ట్రంగా చేయడానికి చేపట్టిన నవోదయం కార్యక్రమంలో భాగంగా నిడదవోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఉండ్రాజవరం మండలంలో పూర్తిగా నిర్మూలించడంలో ఎక్సైజ్, పోలీసుల కృషితో సాధ్యమైందన్నారు. గతంలో సారా కేసులు నమోదైన దమ్మెన్ను, ఉండ్రాజవరం, తాడిపర్రు, మోర్త గ్రామాలను సీ కేటగిరీ గ్రామాలుగా వర్గీకరించి, కేసుల్లోని నిందితుల ప్రస్తుత స్థితిగతులు క్షుణ్ణంగా పరిశీలన, గత రెండు సంవత్సరాలుగా ఈ నాలుగు గ్రామాల్లో ఎటువంటి సారా కేసులు నమోదు కాకపోవడంతో ఉండ్రాజవరం మండలాన్ని సారా రహిత మండలంగా ప్రకటించడం జరిగిందని ఆయన వివరించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు.

కార్యక్రమంలో తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఎంపీడీవో వీఎస్ రామారావు, ఎక్సైజ్ ఎస్ఐ జేఎన్ఎస్ బాలాజీ, పోలీసు సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ

కొవ్వూరు, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొబైల్ రేషన్ వ్యానులు రద్దుచేసి జూన్ 1వ తేదీ నుంచి రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ చేస్తునట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో తాళ్లపూడి మండల రేషన్ డీలర్ల ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. డీలర్ల ద్వారా నిత్యవసరాలు పంపిణీ చేయడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, తాళ్లపూడి మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న ఐషర్‌వ్యాన్... డ్రైవర్ మృతి

దేవరపల్లి, మే 30 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన ఐషర్ వ్యాన్ ఢీకొన్న ఘటనలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన దేవరపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజమండ్రి వైపు నుంచి ఏలూరు వైపు వెళ్తున్న ఐషర్ వ్యాన్ దేవరపల్లి డైమండ్ జంక్షన్ సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వెళ్తున్న లారీని ఢీకొనడంతో ముందు క్యాబిన్ నుజ్జునుజ్జయ్యింది. దీంతో డ్రైవర్ (36) అక్కడికక్కడే మృతి చెందినట్టు ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ వాహనం తమిళనాడుకు చెందినదిగా గుర్తించారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

